TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

CEO &Chief Editor: Medi Naresh

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 35 శుక్రవారం 4-09- 2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు-8 వేల:2.00/-

## మీసం మెలేసిన కొండా మురళి!

**రాజకీయంలో ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే ఎవరూ తట్టుకోరు**
**పదవులు ఉన్నా... లేకున్నా మా గౌరవం మాకు ఎప్పుడూ ఉంటుంది**
**దేనికీ భయపడం : మురళి ట్వీట్**



హైదరాబాద్,
మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేసిన నేపథ్యంలో ఆమె భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మీసం మెలేయడం చర్చనీయాంశంగా మారింది. బర్తరఫ్ వార్త వెలువడిన వెంటనే గురువారం హైదరాబాద్‌లోని తమ నివాసానికి పెద్దఎత్తున చేరుకున్న మీడియా ప్రతినిధులు, కార్యకర్తలు, అనుచరుల ముందుకు వచ్చిన మురళి.. చిరునవ్వుతో కనిపించారు. మొదటి అంతస్తు బాలనీలోకి వచ్చిన మురళి.. అందరూ చూస్తుండగానే మీసం మెలేసి, ఇక వెనక్కి తగ్గేది లేదన్న సంకేతాలిచ్చారు. కొండా మురళి చేసిన ఈ సంజ్ఞకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. రాజకీయంగా కక్షపూరిత చర్యలు చేపట్టినా తాము భయపడబోమని, తమ వర్గం బలం ఏందో నిరూపిస్తామన్న రీతిలో ఆయన వ్యవహరించారని విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్తు రాజకీయ పోరాటాన్ని ఎదురొనేందుకు సిద్ధమనే సంకేతాలిచ్చారని చెప్తున్నారు.

## ఎస్ఐఆర్'తో దేశవ్యాప్తంగా
# 13.37 కోట్ల ఓట్ల తొలగింపు!

- మూడు దశల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ
- మహారాష్ట్రలో అత్యధికంగా 2.07 కోట్ల ఓట్లు తొలగింపు
- కర్ణాటకలో 1.08 కోట్ల ఓట్లకు కోత
- ఢిల్లీలో అత్యధికంగా 32.8 శాతం ఓట్ల తొలగింపు
- ఏపీలో 44.90 లక్షల ఓట్లు తొలగింపు
- ఇది తుది జాబితా కాదు.. డ్రాఫ్ట్ మాత్రమే
- పత్రాల పరిశీలన అనంతరం అర్హుల పేర్లు పునరుద్ధరించే అవకాశం
- పేరు గల్లంతైతే ఫామ్--6తో దరఖాస్తు
- అభ్యంతరాలకు ఫామ్--7.. వివరాల సవరణకు ఫామ్--8

02

**తాజా డేటా వెల్లడి.. తెలంగాణలో 73.39 లక్షల ఓట్లకు కోత**

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో భారీగా ఓట్లు తొలగించినట్లు తాజా డేటా వెల్లడించింది. ఇప్పటివరకు మూడు దశల్లో జరిగిన ప్రక్రియలో దేశవ్యాప్తంగా 13.37 కోట్ల ఓట్లు, అంటే మొత్తం ఓట్లలో 14.1 శాతం జాబితాల నుంచి తొలగించారు. ఇందులో మహారాష్ట్రలో అత్యధికంగా 2.07 కోట్లు, కర్ణాటకలో 1.08 కోట్లు, తెలంగాణలో 73.39 లక్షల ఓట్లు తొలగించినట్లు సమాచారం. ఓట్ల శాతం పరంగా ఢిల్లీలో అత్యధికంగా 32.8 శాతం కోత పడగా, ఏపీలో 44.90 లక్షల ఓట్లు తొలగించారు.అయితే ఇవి తుది ఓటర్ల జాబితాలు కావని, డ్రాఫ్ట్ జాబితాలు మాత్రమేనని ఈసీఐ స్పష్టం చేసింది. పత్రాల పరిశీలన అనంతరం అర్హులైన వారి పేర్లను తిరిగి జాబితాలో చేర్చే అవకాశం ఉంది. ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైతే ఫామ్--6, అభ్యంతరాలు లేదా పేరు చేర్పు, తొలగింపుపై దరఖాస్తుకు ఫామ్--7, వివరాల సవరణకు ఫామ్--8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటర్లు తమ పేరు ఉందో లేదో ఈసీఐ ఓటర్ సేవల పోర్టల్ లేదా వోటర్ హెల్ప్‌లైన్ యాప్‌లో పరిశీలించుకోవచ్చు.



## నన్ను తొలగించడం
# కుట్రే..

- రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
- నన్ను తొలగించకపోతే తప్పుకుంటానన్నారు
- బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు
- కాంగ్రెస్‌పార్టీలోనే ఉంటా.. నేను పార్టీ మారను
- నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని
- రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదు
- బీసీ మహిళా మంత్రిగా అణచివేతకు గురయ్యా
- నిర్ణయంపై రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి
- బర్తరఫ్ పై మీడియా సమావేశంలో కొండా సురేఖ
- అధిష్టానానికి పంపిన లేఖ కొండా సురేఖ రిలీజ్

హైదరాబాద్,
మంత్రి పదవి నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సురేఖను తొలగించకపోతే తాను తప్పుకొంటానని అధిష్ఠానాన్ని రేవంత్ బెదిరించారని ఆమె వ్యాఖ్యానించారు. లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడకముందే.. తన బర్తరఫ్‌ను ఆమె ధ్రువీకరించారు. ఈ సందర్భంగా టీవీ9తో మాట్లాడిన సురేఖ పలు కీలక విషయాలను వెల్లడించారు. తనను తొలగించే ముందు కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదని సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. తన వివరణ కూడా తీసుకోలేదని, రాజీనామా -మిగతా 2 లో

## కొండా సురేఖ
# బర్తరఫ్

## నేడే నింగిలోకి 'నాటీ బాయ్'!

- జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో
- శుక్రవారం తెల్లవారుజామున 2:55 గంటలకు ప్రయోగం
- ఈవోఎస్-05 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్న ఇస్రో
- ప్రయోగానికి ప్రారంభమైన కౌంట్‌డౌన్
- వరుస వైఫల్యాలతో 'నాటీ బాయ్'గా జీఎస్ఎల్‌వీకి పేరు
- తొలి 18 ప్రయోగాల్లో ఆరు విఫలమైన వైనం
- 36 వేల కిలోమీటర్ల ఎత్తులో జియోసింక్రోనస్ కక్ష్యలోకి ఉపగ్రహం
- భారత ఉపఖండ చిత్రాలను తరచూ అందించనున్న ఈవోఎస్-05
- సరిహద్దులు, వ్యూహాత్మక ప్రాంతాల నిఘాలో కీలకంగా మారనున్న ఉపగ్రహం



02

**మంత్రివర్గం నుంచి ఉద్వాసన**

- రాజీనామాకు నిరాకరించిన సురేఖ
- బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్
- గవర్నర్ కు సిఎం రేవంత్ రెడ్డి లేఖ
- సిఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..
- చిన్నారెడ్డీ పైనా కాంగ్రెస్ పార్టీ వేటు



తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత సంక్షోభానికి అధిష్టానం గట్టి ఫుల్‌స్టాప్ పెట్టింది. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించిన మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డిపై ఒకేసారి వేటు వేస్తూ హైకమాండ్ కఠిన నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతల వరుస సమావేశాల అనంతరం ఈ నిర్ణయం ఖరారైనట్లు సమాచారం. అదే సమయంలో సామాజిక సమీకరణాల దృష్ట్యా ఖాళీ అయిన మంత్రి పదవి, ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ పోస్టుల భర్తీపై కూడా హై కమాండ్ కసరత్తు ప్రారంభించడంతో తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేచింది.

02


## నేపాల్‌లో మృత్యుఘోష

**1,252 మంది మృతి**

- 4,800 మంది గల్లంతు.. సహాయక చర్యల్లో భారత బృందాలు
- ఎనిమిది జిల్లాల్లో ముమ్మరంగా రెస్క్యూ ఆపరేషన్
- ఇప్పటివరకు 163 మంది భారతీయుల రక్షణ
- 275 మందికిపైగా భారతీయుల ఆచూకీ కోసం గాలింపు
- 19 మంది ఫోరెన్సిక్ నిపుణులతో భారత ప్రత్యేక బృందం
- సొరంగంలో 100 మీటర్ల వరకు చేరుకున్న భారత సాంకేతిక బృందం
- బాధిత ప్రాంతాలకు కార్గో డ్రోన్లతో సాయం అందించే యోచన
- హెలికాప్టర్లతో సహాయక సామగ్రి తరలింపు
- పర్వత ప్రాంతాల్లో పోర్టర్ల సేవలు వినియోగించనున్న ఐరాస



ఖాట్మండు:
నేపాల్‌లో వరద మృతుల సంఖ్య 1,252కు చేరుకుంది. గురువారానికి కనిపించకుండాపోయినవారి సంఖ్య 4,800గా ఉందని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఆర్ఎంఏ) వెల్లడించింది. దాదాపు 21 వేల 314 మంది భద్రతా సిబ్బంది, సహాయక సిబ్బంది వరదల్లో దెబ్బ తిన్న ఎనిమిది జిల్లాల్లో మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. నేపాల్‌లో ఇప్పటివరకు 163 మంది భారతీయులను కాపాడినట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. -మిగతా 2 లో




## తెలంగాణ, ఏపీలో వానలు...

- అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరిక
- తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడి
- 13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- ఏపీలో సెప్టెంబర్ 5 వరకు వర్షాలు కురిసే అవకాశం
- బంగాళాఖాతంలోకి మత్స్యకారులు వెళ్లవద్దని హెచ్చరిక

హైదరాబాద్,
తెలుగు రాష్ట్రాల్లో రానున్న కొన్ని రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు వాతావరణ శాఖ అధికారులు 13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, తెలంగాణలోని హైదరాబాద్, జగిత్యాల, కామారెడ్డి సహా పలు జిల్లాల్లో ఉరుములు, -మిగతా 2 లో

## కాంగ్రెస్‌కు
# డెడ్‌లైన్

**వినాయక చవితికల్లా సాగర్ నీళ్లు ఇవ్వాలి**

- లేకుంటే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేస్తాం
- రైతు ఉద్యమంతో ప్రభుత్వాన్ని గద్దె దించుతాం
- మంత్రులు సాగర్ డ్యామ్‌లో దూకితే తెలుస్తుంది.. నీళ్లున్నాయో లేవో!
- కృష్ణా నీటిని ఆంధ్రాకు తరలించుకు పోతుంటే ప్రశ్నించలేని రాష్ట్ర మంత్రులు
- మిర్యాలగూడ రైతు మహాధర్నాలో నిప్పులు చెరిగిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ఉమ్మడి నల్గొండ బ్యూరో,
నాగార్జున సాగర్ నీటి విడుదలపై సెప్టెంబర్ 14 లోగా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించారు. ఆ లోపు ప్రకటన చేయకపోతే సెప్టెంబర్ 14 నుండి కోదాడ నుండి హాలియా వరకు పాదయాత్ర నిర్వహిస్తానని ఆయన హెచ్చరించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు-మిగతా 2 లో




## రష్యా ఆయిల్
# కొంటాం

- ఉక్రెయిన్‌కు తేల్చి చెప్పిన భారత్
- 140 కోట్ల ప్రజల అవసరాలు తీర్చాల్సిన బాధ్యత ఉంది
- రష్యా--ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు సహకరిస్తాం
- చర్చలు, దౌత్యంతోనే సమస్యకు పరిష్కారమన్న జైశంకర్
- కీవ్‌లో ఉక్రెయిన్‌కు భారత్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ
రష్యా నుంచి ఆయిల్ కొంటామని ఉక్రెయిన్‌కు భారత్ తేల్చి చెప్పేసింది. తమ పౌరుల అవసరాలు తీర్చాల్సిన బాధ్యత తమపై ఉన్నదని, తమ దేశంలోని 140 కోట్ల ప్రజల అవసరాలను తీర్చడానికి రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామని స్పష్టం చేసింది. ప్రస్తుతం మధ్య ఆసియాలో నెలకొన్న పరిస్థితుల్లో చమురు సేకరణ సవాలుగా మారిందని, ఈ పరిస్థితులను ఉక్రెయిన్ గ్రహించాలని తెలిపింది. ఉక్రెయిన్‌లో.. ఆ దేశ మీడియాకు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఇచ్చిన సమాధానమిది.
-మిగతా 2 లో

# నేడే నింగిలోకి 'నాటీ బాయ్'!

**-జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో**
**-శుక్రవారం తెల్లవారుజామున 2:55 గంటలకు ప్రయోగం**
**-ఈవోఎస్-05 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్న ఇస్రో**
**-ప్రయోగానికి ప్రారంభమైన కౌంట్‌డౌన్**
**-వరుస వైఫల్యాలతో 'నాటీ బాయ్'గా జీఎస్ఎల్వీకి పేరు**
**-తొలి 18 ప్రయోగాల్లో ఆరు విఫలమైన వైనం**
**-36 వేల కిలోమీటర్ల ఎత్తులో జియోసింక్రోనస్ కక్ష్యలోకి ఉపగ్రహం**
**-భారత ఉపఖండ చిత్రాలను తరచూ అందించనున్న ఈవోఎస్-05**
**-సరిహద్దులు, వ్యూహాత్మక ప్రాంతాల నిఘాలో కీలకంగా మారనున్న ఉపగ్రహం**






బెంగళూరు:
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) శ్రీహరికోట నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్17 మిషన్ ద్వారా అత్యాధునిక భూపరిశీలన ఉపగ్రహం ఈవోఎస్-05ను ప్రయోగించేందుకు సిద్ధమైంది. శుక్రవారం తెల్లవారుజామున 2:55 గంటలకు ప్రయోగం చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన కౌంట్‌డౌన్ మొదలైంది. తొలి సంవత్సరాల్లో వరుస అనూహ్య ప్రదర్శనల కారణంగా ఈ రాకెట్ ఇస్రోలో 'నాటీ బాయ్' అనే మారుపేరును సంపాదించుకున్నది. ఈ రాకెట్ అభివృద్ధి పదేపదే ఎదురుదెబ్బలతో సాగింది. దాని మొదటి 18 ప్రయోగాల్లో ఆరు లక్ష్యాన్ని సాధించడంలో విఫలమయ్యాయి. తాజాగా మరోసారి ప్రయోగం చేపట్టనున్నారు. భూమికి సుమారు 36,000 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న జియోసింక్రోనస్ కక్ష్య నుంచి ఈవోఎస్-05 ఉపగ్రహం పనిచేస్తుంది. అందువల్ల ఒక నిర్దిష్ట ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించే అవకాశం లభిస్తుంది. తక్కువ కక్ష్యల్లో ఉండే ఉపగ్రహాలు ఒక ప్రాంతం మీదుగా ఎప్పటికప్పుడు దాటిపోతుంటాయి. కానీ జియోసింక్రోనస్ ఉపగ్రహం ఒకే ప్రాంతంపై సుదీర్ఘకాలం పాటు దృష్టి పెట్టగలదు. జీశాట్-1ఏగా కూడా పిలిచే ఈవోఎస్-05 భారత ఉపఖండానికి సంబంధించిన చిత్రాలను తరచూ అందించేలా రూపొందించబడింది. ముఖ్యంగా భారత్ తన సరిహద్దులు, వ్యూహాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచడానికి ఇది ఎంతో కీలకం కానున్నది.

# ఎస్ఐఆర్'తో దేశవ్యాప్తంగా 13.37 కోట్ల ఓట్ల తొలగింపు!

- **మూడు దశల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ**
- **మహారాష్ట్రలో అత్యధికంగా 2.07 కోట్ల ఓట్లు తొలగింపు**
- **కర్ణాటకలో 1.08 కోట్ల ఓట్లకు కోత**
- **ఢిల్లీలో అత్యధికంగా 32.8 శాతం ఓట్ల తొలగింపు**
- **ఏపీలో 44.90 లక్షల ఓట్లు తొలగింపు**
- **ఇది తుది జాబితా కాదు.. డ్రాఫ్ట్ మాత్రమే**
- **పత్రాల పరిశీలన అనంతరం అర్హుల పేర్లు పునరుద్ధరించే అవకాశం**
- **పేరు గల్లంతైతే ఫామ్--6తో దరఖాస్తు**
- **అభ్యంతరాలకు ఫామ్--7.. వివరాల సవరణకు ఫామ్--8**

: కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన 'సర్' ద్వారా దేశవ్యాప్తంగా ఓట్ల తొలగింపు, గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. 'సర్' అంశానికి సంబంధించి ఇప్పటివరకు వెల్లడైన డాటా ప్రకారం.. దేశవ్యాప్తంగా 13.37 కోట్ల ఓట్లను ఈసీఐ తొలగించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అన్నిచోట్లా కలిపి 13 కోట్ల మంది పేర్లను ఓటర్ జాబితానుంచి ఈసీఐ తొలగించింది. ఇది మొత్తం 14.1 శాతం ఓట్లకు సమానం.సర్' ప్రక్రియకు సంబంధించిన కీలక వివరాలివి. మొదట బిహార్‌లో ప్రారంభమైన సర్ ప్రక్రియ ఇప్పటివరకు మూడు దశల్లో కొనసాగింది. మహారాష్ట్రలో అత్యధికంగా 2.07 కోట్ల ఓట్లను తొలగించింది. ఆ తర్వాత కర్ణాటకలో 1.08 కోట్ల ఓట్లు తొలగిపోయాయి. ఆ తర్వాత ఎక్కువ ఓట్లు తొలగిపోయిన మూడో రాష్ట్రం తెలంగాణ. ఇక్కడ ఏకంగా 73.39 లక్షల ఓట్లు తొలగిపోయాయి. ఓటర్ల శాతం పరంగా చూస్తే ఢిల్లీలో అత్యధికంగా 32.8 శాతం ఓట్లు తొలగిపోయాయి. ఢిల్లీలో 47.57 లక్షల ఓట్లు, తర్వాత ఏపీలో 44.90 లక్షల ఓట్లు తొలగిపోయాయి. అయితే, ఇది తుది జాబితా కాదు. డ్రాఫ్ట్ మాత్రమే. ప్రస్తుతం ఈ జాబితాలో ఓట్లు గల్లంతైన వారు తగిన డాక్యుమెంట్లతో సంబంధిత అధికారులను సంప్రదించాలి. వాటిని పరిశీలించిన అనంతరం అర్హులైన వారి పేరును ఓటర్ల జాబితాలో చేరుస్తారు. అలా, పేర్లు గల్లంతైన వారు తమ అభ్యంతరాలు తెలుపుతూ సమీక్ష కోరే అవకాశం ఉంది. ఇవన్నీ పూర్తైన తర్వాత దేశవ్యాప్తంగా పూర్తిస్థాయి ఓటర్ల జాబితా వెలువడుతుంది. ఓటరు జాబితాలో మీ పేరు ఉందో, లేదో తెలుసుకోవాలనుకుంటే జశేవతీం.వఏఱ.స్త్రశీఙ.ఱఅ ను సంప్రదించాలి. లేదా వోటర్ హెల్ప్‌లైన్ యాప్‌లో కూడా చెక్ చేసుకోవచ్చు. పూర్తిగా జాబితా నుంచి పేరు గల్లంతైతే ఫాం 6, జాబితాలో పేరు ఉంచడానికి లేదా తొలగించడానికి తగిన అభ్యంతరాలపై ఫాం 7, జాబితాలో పేరుండి వివరాలు తప్పుగా ఉంటే ఫాం 8 దరఖాస్తు నింపాల్సి ఉంటుంది. అవసరమైతే బూత్ లెవల్ ఆఫీసర్‌ను కూడా సంప్రదించవచ్చు.

# నేపాల్‌లో మృత్యుఘోష.



275 మందికిపైగా భారతీయులు, 128 మందికిపైగా భారత సంతతికి చెందినవారి అడ్రస్ ఇప్పటికీ తెలియలేదని చెప్పారు. సహాయక పనుల్లో భారతీయ బృందాలు 19 మంది ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందం ఖాట్మండులో సహాయక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. అదనంగా భారత్ నుండి సొరంగంలో చిక్కుకుపోయిన వారిని కాపాడే బృందం కూడా నేపాల్ అధికారులకు సాయంగా ఉన్నారని చెప్పారు. చిలిమె విద్యుత్ కేంద్రం సొరంగంలో చిక్కుకున్న వారిని వెలికితీసే పనుల్లో నిమగ్నమై ఉన్న భారతీయ సాంకేతిక బృందాన్ని నేపాల్‌లో భారత రాయబారి నవీన్‌శ్రీవాస్తవ గురువారం కలిశారు. ఆధునికమైన యంత్రాలను వినియోగించడం ద్వారా సొరంగంలోపల 100 మీటర్ల వరకు సాంకేతిక బృందం చేరుకోగలిగిందని చెప్పారు. సొరంగంలో మరింత ముందుకు వెళ్లడం కోసం భారీ యంత్ర సామగ్రిని వినియోగించే ప్రణాళికలో భారతీయ సాంకేతిక బృందం ఉందని ఎక్స్‌లో చేసిన పోస్ట్‌లో శ్రీవాస్తవ పేర్కొన్నారు.

**రంగంలోకి కార్గో డ్రోన్లు**

వరద బాధిత్ ప్రాంతాలకు చేరుకోవడం అత్యంత సవాల్‌తో కూడుకున్నదని ఐక్యరాజ్యసమితి (రాస) హెచ్చరించింది. సహాయక చర్యల్లో భాగంగా ఆహార పదార్థాలు, ఇతర సామగ్రిని చేరవేయడానికి హెలికాప్టర్లు, కార్గో డ్రోన్లను వినియోగించడంపై ప్రస్తుతం చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది. విపత్తు తీవ్రత, సంభవించిన నష్టం భారీగా ఉందని ఐరాస రెసిడెంట్ కోఆర్డినేటర్ లిలా పీటర్స్ యామియా ఖాట్మండులో మీడియాతో అన్నారు. "నివాసాలు కోల్పోయినవారిలో 84 శాతం మంది వచ్చిన 800 మందికిపైగా పర్యాటకులు ఉన్నార'ని తెలిపారు.

**పోర్టర్లే దిక్కు**

ట్రెక్కింగ్ చేసేవారు, శిఖరాలను అధిరోహించేవారి కోసం భారీ మొత్తంలో సామగ్రిని పర్వతాల మీదుగా మోసుకువెళ్లడంలో దిట్టలైన నేపాల్ పోర్టర్లు ప్రస్తుతం పరిస్థితుల్లో అక్కరకు వస్తారని ఐరాస రెసిడెంట్ కోఆర్డినేటర్ తెలిపారు. వరద బాధితులకు సాధ్యమైనంత త్వరగా సాయం అందించడంలో పోర్టర్ల సేవలను వినియోగించుకుంటామని చెప్పారు.

# కొండా సురేఖ బర్తరఫ్

**-రాజీనామాకు నిరాకరించిన సురేఖ**
**-బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్**
**-గవర్నర్ కు సిఎం రేవంత్ రెడ్డి లేఖ**
**-సిఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..**
**-చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు**



హైదరాబాద్,
తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో పరిపాలనాపరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు. కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది. సురేఖ న్యూఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే 'షో-కాజ్ నోటీసు' (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

## నన్ను తొలగించడం కుట్రే..

చేయాలని కూడా ఎవరూ చెప్పలేదన్నారు. అధిష్ఠానం నుంచి తనకు ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. తనతో మాట్లాడి వివరణ తీసుకుని ఉండాల్సిందని అన్నారు. తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి కుట్ర చేశారని సురేఖ ఆరోపించారు. అయితే తదుపరి కార్యాచరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. తాను తప్పు చేశాననే భావన లేదన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత మాట్లాడిన మాటలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. సుస్మిత స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని, ఆమె అభిప్రాయాలను తాము ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము మాట్లాడించలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిని చాలామంది విమర్శిస్తున్నా.. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో సీఎం ఆత్మపరిశీలన చేసుకోవాలని సురేఖ అన్నారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారిలో తామే ముందున్నామని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించింది రేవంత్‌రెడ్డినేనని చెప్పారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని సురేఖ స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై తమకు అభిమానం ఉందన్నారు. 2018లో కూడా ఇదే "దుష్టశక్తులు" తనకు టికెట్ రాకుండా అడ్డుకున్నాయని, అందుకే అప్పట్లో బీఆర్ఎస్ వైపు చూడాల్సి వచ్చిందని చెప్పారు. అన్ని విషయాలను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు వివరించినట్లు వెల్లడించారు. ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను మాత్రం ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తొలగించడం అధిష్ఠానానికి కూడా ఇష్టం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, 'బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపొమ్మంటారా' అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు. తన మీద, తన మాజీ ఓఎస్డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి, కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మరికొందరు ఉన్నారన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీపై నేను ఎలాంటి విమర్శలు చేయలేదు. ఒకప్పుడు మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిట్టారు. మాజీ సీఎం రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని తిట్టారు. నా కుమార్తె వ్యాఖ్యలకు నాపై చర్యలు తీసుకోవటం బాధాకరం. రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ పదవి తెచ్చుకున్నారని తిట్టినవారికి పదవులు ఇచ్చారు. నన్ను తొలగించినందుకు ఏమీ బాధపడటం లేదు. కారణం చెప్పకుండా తొలగించడమే చాలా బాధాకరం. బీసీ మహిళను ఇలా అవమానకరంగా తొలగించటం బాధాకరం. కారణం చెప్పకుండా తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. కారణం చెప్పాల్సిన బాధ్యత సీఎం, ఏఐసీసీపై ఉందని అన్నారు. మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని, తన ప్రమేయం లేకుండానే తన శాఖలో నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. తనకు తెలియకుండా తన ఓఎస్డీ సుమంత్‌ను తప్పించారని, అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని విమర్శించారు. తన శాఖలోని అంశాలపై కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, తన శాఖలోని అధికారులతో కడియం సమీక్షలు నిర్వహించారని తెలిపారు. మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా? గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలని సురేఖ కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ సంతోషంగా లేరనే విషయం అందరికీ తెలుసనని తెలిపారు. ఇప్పటికైనా అందరూ బయటికి వచ్చి ధైర్యంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలకు సేవ, అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలో ఉందని, పనుల జరగాలంటే ఎవరివద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని ఆరోపించారు. ఇస్తామన్న హామీలు నెరవేర్చకపోవటం వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని స్పష్టం చేశారు. తాను తప్పు చేయలేదని, తనకు పశ్చాత్తాపం లేదని కొండా సురేఖ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. వైఎస్ఆర్ తర్వాత రేవంత్ రెడ్డినే ఎక్కువ అభిమానించానని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు, సీఎం కావాలని తానే ముందు కోరుకున్నానని పేర్కొన్నారు. తనపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నానన్న కొండా సురేఖ తన వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు రావటం సంతోషకరమని తెలిపారు. తన కోసం చిన్నారెడ్డిపై వేటు వేయటం సరికాదని అభిప్రాయపడ్డారు. తన కుమార్తె వ్యాఖ్యలను తాను ఖండించాల్సిన అవసరం లేదన్న సురేఖ తన కుమార్తె వ్యక్తిగత అభిప్రాయాన్ని తప్పుపట్టే అధికారం తనకు లేదని స్పష్టం చేశారు. అధిష్ఠానానికి తాను ఇచ్చిన లేఖను మీడియాకు ఇస్తున్నానని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదని తెలిపారు. జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం నిర్ణయం తీసుకున్నారని ఆమె నిలదీశారు.

# తెలంగాణ, ఏపీలో వానలు...

మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈశాన్య మధ్యప్రదేశ్ పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతుండగా, దానికి అనుబంధంగా సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. దీనికి తోడు, మధ్యప్రదేశ్ నుంచి తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు రుతుపవన ద్రోణి కూడా కొనసాగుతోందని, వీటి ప్రభావంతోనే వర్షాలు కురుస్తాయని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 3, 4 తేదీల్లో మత్స్యకారులు చేపల వేట కోసం బంగాళాఖాతంలోకి వెళ్లవద్దని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉన్నందున, ప్రజలు విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగ్‌ల కింద ఉండరాదని, అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

# రష్యా ఆయిల్ కొంటాం

అయితే, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఆపడానికి తాము అన్ని విధాల సహకరిస్తామని హామీ ఇచ్చింది. అంతేకాదు, ఇది యుద్ధాల యుగం కాదని, చర్చ, దౌత్యంతోనే సమస్యను పరిష్కరించుకోవాలని, ఉక్రెయిన్, రష్యాల యుద్ధంపై తమ వైఖరి ఇదేనని జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్న భారత్‌పై యూరప్ దేశాలు, అమెరికా కూడా ఆక్షేపణ వ్యక్తంచేశాయి. వార్ మెషిన్‌కు భారత్ ఇంధనం అందిస్తున్నదని, ఉక్రెయిన్‌పై దాడులు చేస్తున్న రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేసి పరోక్షంగా ఈ యుద్ధానికి భారత్ దోహదపడుతున్నదని యూరప్ దేశాలు ఆరోపణలు గుప్పించాయి. కానీ, భారత ప్రభుత్వం తమ వైఖరి మార్చుకోలేదు. తమ దేశ ప్రజల అవసరాలు తీర్చుకోవడానికి రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామని, వాస్తవానికి పశ్చిమాసియా యుద్ధంతో మార్కెట్‌లో ఏర్పడ్డ కొరతకు తాము కొంత కళ్లెం వేస్తున్నామని, రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయకుంటే అంతర్జాతీయ ఆయిల్ మార్కెట్‌లో పరిస్థితులు మరింత తీవ్రమవుతాయని నిపుణులు చెబుతున్నారు.

**మా కొనుగోళ్లతో యుద్ధం జరగట్లేదు**

ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో మీడియాతో జైశంకర్ మాట్లాడుతూ.. 'రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు ఆపేస్తారా? లేక ఉక్రెయిన్‌పై యుద్ధానికి పరోక్షంగా దోహదపడతారా? అని ప్రశ్న వచ్చింది. 'ఈ ప్రశ్నకు కారణమేంటో నాకు తెలుసు. ప్రపంచ ఇంధన పరిస్థితి సంక్షోభం వైపు వెళ్తుండగా 140 కోట్ల మంది ప్రజలకు ఇంధన అవసరాలు తీర్చే ముఖ్యమైన సవాలుపై మీరంతా ఒకసారి ఆలోచించాలి. మరొక విషయం, ఈ యుద్ధం మొదలై ఐదో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నది.

# కాంగ్రెస్‌కు డెడ్‌లైన్

మహాధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్ నుండి మిర్యాలగూడకు చేరుకున్న ఆయన బైపాస్ మీదుగా సభాస్థలి అయిన ఎన్ఎస్పీ క్యాంపు వరకు రోడ్ షో నిర్వహించారు. ఆయనతో కలిసేందుకు రైతులు పోటీలు పడ్డారు. రోడ్ షో అనంతరం సభాస్థలికి చేరుకున్న కేటీఆర్...తన ప్రసంగంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కేసీఆర్ హయాంలో సాగర్ ఆయకట్టు కళకళలాడితే, నేడు పంటలు లేక దుర్భర పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ధర్నాకు పిలుపునివ్వగానే కాంగ్రెస్ ప్రభుత్వానికి చలిజ్వరం పట్టుకుందని, రైతు వ్యతిరేక కుట్రలను కచ్చితంగా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో రికార్డు స్థాయిలో వరి పండిందని, కానీ నేడు సాగర్ ఆయకట్టులో నీళ్లు లేకపోవటం వల్ల ఎండిపోతున్నాయని తెలిపారు. సంతలో అడ్డాస్ పాట పాడినట్లు అబద్ధాలుగా 420 హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, రైతు డిక్లరేషన్ పేరిట రైతులను మోసపుచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రదర్శించి ఎండగట్టారు.

**నీళ్లు ఉన్నా ఇవ్వడం లేదు**

నాగార్జున సాగర్‌లో ప్రస్తుతం 180 టీఎంసీల నీళ్లు ఉన్నప్పటికీ, పంటలకు నీళ్లు విడుదల చేయడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. జిల్లాలో ఇద్దరు మంత్రులున్నా నీళ్లు ఇవ్వలేకపోతున్నారని ఖబర్ అని హెచ్చరించారు. ఇక్కడ నీళ్లు లేవంటున్న మంత్రులు సాగర్ గుండంలో దూకితే నీళ్లు ఉన్నాయో లేదో తెలుస్తుందన్నారు. సాగర్ ఆయకట్టుకు నీరు ఇవ్వని కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రజలు నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. వెలుగుపల్లి ప్రాజెక్టు ద్వారా 52 టీఎంసీల నీటిని ఆంధ్రాకు తరలిస్తున్నారని, సీఎం మంత్రులు ఆంధ్రా గులాములై అమ్ముడుపోయారని ఆరోపించారు. 2003లోనే కేసీఆర్ పాదయాత్ర చేసి నీటిని సాధించారని గుర్తుచేశారు. కేసీఆర్ స్ఫూర్తితో మరో రైతు ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. పది రోజుల గడువులోగా సాగర్ నీటి విడుదలపై ప్రభుత్వం స్పందించకపోతే లక్షలాది మంది రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా నీటిని ఏపీ ప్రభుత్వం అక్రమంగా తరలించుపోతున్నా కనీసం ప్రశ్నించలేని చేతగాని సీఎం రైతులకు అండగా ఉంటానని మోసపు మాటలు మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. జిల్లాకు చెందిన భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన శాఖకు సంబంధించిన విషయాలపై కూడా స్పష్టత లేకుండా ఉన్నాడని విమర్శించారు. సాగర్ లో 180 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నా ప్రభుత్వం సాగర్ ఎడమ కాలువకు ఎందుకు సాగునీటిని విడుదల చేయడం లేదో రైతాంగానికి స్పష్టంగా చెప్పాలని జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. మిర్యాలగూడ, కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాలు, ఖమ్మం జిల్లాలో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయకపోవడం వల్ల లక్షలాది ఎకరాలు బీడు భూములుగా మారిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ చేతగానితనంపై సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలోని రైతాంగంతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని జగదీష్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు, రమావత్ రవీంద్ర కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గాదరి కిషోర్ కుమార్, నోముల భగత్, మాజీ జడ్పీ ఛైర్మన్ బండా నరేందర్ రెడ్డి, నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# చెన్నూరు శివాలయం ముందు 200 ఏళ్ల రావిచెట్టు నరికివేతపై భక్తుల ఆందోళన





**అనుమతి ఎవరిచ్చారు? అయ్యగార్లకు సమాచారం ఇవ్వకుండానే చెట్టు తొలగించారని ఆరోపణ**

**నవసంఘర్షణ,చెన్నూరు, సెప్టెంబర్ 3**
మంచిర్యాల జిల్లా చెన్నూరులోని ప్రసిద్ధ అగస్త్యేశ్వర స్వామి ఆలయం ముందు దశాబ్దాలుగా భక్తుల పూజలు అందుకుంటున్న పురాతన రావిచెట్టును నరికివేయడంపై భక్తులు, ఆలయ అయ్యగార్లు, స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సుమారు 200 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన ఈ రావిచెట్టును నరికివేయడానికి అనుమతి ఎవరు ఇచ్చారో అధికారులు స్పష్టం చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆలయ అయ్యగార్లు ఊరికి వెళ్లిన సమయంలో, వారికి ఎలాంటి సమాచారం లేదా నోటీసు ఇవ్వకుండా చెట్టును నరికివేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.చెన్నూరు అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి ఎంతో ప్రత్యేకమైన ఆధ్యాత్మిక చరిత్ర ఉంది. ఆలయంలోని అఖండ జ్యోతిని సుమారు 410 సంవత్సరాల క్రితం జక్కేపల్లి సదాశివయ్య అనే బ్రాహ్మణ పూజారి వెలిగించారని, అప్పటి నుంచి ఆయన వారసులు ప్రతిరోజూ నూనె/నెయ్యి పోస్తూ జ్యోతిని నిరంతరం వెలిగిస్తూ వస్తున్నారని ఆలయ వర్గాలు చెబుతున్నాయి. ఇంతటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఆలయం ముందు ఉన్న పురాతన రావిచెట్టును తొలగించడంపై భక్తులు ప్రశ్నలు సంధిస్తున్నారు. "చెట్టును నరికివేయడానికి అనుమతి ఇచ్చింది ఎవరు? ఆలయ నిర్వాహకులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదు? చెట్టు తొలగింపునకు సంబంధించి అధికారిక అనుమతులు ఉన్నాయా?" అనే విషయాలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు ప్రజలకు వెల్లడించాలని వారు కోరుతున్నారు.
ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా చెట్టును నరికివేసినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భక్తులు, అయ్యగార్లు, చెన్నూరు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలితే వారిపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. "చెన్నూరు చారిత్రక వారసత్వాన్ని కాపాడాలి.. ఆలయ పవిత్రతను పరిరక్షించాలి" అంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

## కమాన్‌పూర్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మళ్లీ ఎస్.ఎస్. అన్వర్


**-మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో మరోసారి బాధ్యతలు**
**-ఘనంగా సత్కరించిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్**



**రామగిరి, నవసంఘర్షణ**
కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎస్.ఎస్. అన్వర్ మరోసారి నియమితులయ్యారు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో ఆయనకు వరుసగా రెండోసారి ఈ బాధ్యతలు దక్కాయి.పార్టీ కోసం చేసిన సేవలకు గుర్తింపుగా అధిష్ఠానం మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో మండల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.ఈ సందర్భంగా రామగిరి మండలం బేగంపేట్ ఎక్స్ రోడ్డులోని మంథని బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో నూతన అధ్యక్షుడు అన్వర్‌ను మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు ఆశయాలకు అనుగుణంగా,రానున్న రోజుల్లో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి మరింత చిత్తశుద్ధితో పని చేయాలని ఆయన ఆకాంక్షించారు.అందరినీ కలుపుకుపోతూ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఉపాధ్యక్షులు ఎల్ల రామ్మూర్తి, కార్యదర్శి రోడ్డ బాపన్న,కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గూగులోత్ ప్రవీణ్ నాయక్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంబిర్ శీను, గొల్లపల్లి రాజమల్లు,యూత్ కాంగ్రెస్ నాయకులు భోగే ప్రకాష్,చక్రి,రామగిరి మండలం ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మోత్కూరి నవీన్ గౌడ్,శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూర్ సబ్‌సెంట ర్‌ను తనిఖీ చేసిన వైద్యా ధికారి డా. ఎల్లాల అంజి త్ రెడ్డి

**సీజనల్ వ్యాధుల నివా రణపై ప్రత్యేక దృష్టి**




**నవసంఘర్షణ/మెట్ పల్లి**
ఆత్మకూర్ సబ్‌సెంటర్‌ను వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌సెంట ర్‌లో నిర్వహిస్తున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమా లకు సంబంధించిన రికార్డు లను క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరించారు.ప్రస్తుతం కొ నసాగుతున్న సీజనల్ వ్యా ధులు (డెంగ్యూ, మలేరి యా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, అతిసార వ్యాధు లు) నివారణ చర్యలపై ప్ర త్యేకంగా సమీక్ష నిర్వహిం చారు. జ్వరాల పర్యవేక్షణ, ఇంటింటి సర్వేలు, అనుమా నిత కేసుల సకాలంలో గు ర్తింపు, దోమల నివారణ చ ర్యలు, తాగునీటి పరిశుభ్ర త, ప్రజల్లో అవగాహన కా ర్యక్రమాలను మరింత సమ ర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అ నంతరం స్థానిక ప్రజలతో మాట్లాడి సబ్‌సెంటర్ ద్వా రా అందుతున్న ఆరోగ్య సే వల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. జ్వరం లే దా ఇతర సీజనల్ వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంట నే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని, వైద్యుల సలహాలు పాటిం చాలని ప్రజలకు సూచించా రు.అలాగే నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ ప్ర మాణాలకు అనుగుణంగా అన్ని రికార్డులను పూర్తిస్థా యిలో, క్రమబద్ధంగా నిర్వ హించాలని సిబ్బందికి ఆదే శాలు జారీ చేశారు.నాణ్య మైన ఆరోగ్య సేవలు అందిం చడంలో ఎటువంటి నిర్ల క్ష్యం ఉండకూడదని సూచించారు.

## మంథని శివారులో గుడుంబా స్థావరంపై పోలీసుల మెరుపు దాడి





**మంథని, నవసంఘర్షణ సెప్టెంబర్ 03:**
మంథని పట్టణ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో అక్రమ గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం పానకం ప్రదేశంపై గురువారం మంథని పోలీసులు మెరుపు దాడి చేశారు. మంథని సీఐ బుద్దె స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన రెస్క్యూ లో ప్లాస్టిక్ క్యాన్లు, డ్రమ్ముల్లో నిలువ చేసిన రెండు వేల లీటర్ల బెల్లం పానకం స్థావరాన్ని గుర్తించి నేల మట్టం చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ చర్యలను చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పల్లెల్లో, పట్టణాల్లో మద్యం అమ్మకాలు, గుడుంబా తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలకు ఎవరైనా పాల్పడితే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. గుడుంబా సేవించడం ఆరోగ్యానికి తీవ్ర హానికరమని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమయపాలన లేకుండా గ్రామాల్లో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్ట్ షాప్ ల వల్ల ప్రజలు మద్యానికి, గుడుంబాకు బానిసై, ఆ మత్తులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వారు తెలిపారు. సమాచారం తెలిసిన వారు పోలీసు సిబ్బందికి తెలియజేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వారు తెలిపారు. ఈ రెస్క్యూలో హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణ నాయక్, రమేష్ రావు కానిస్టేబుళ్లు శివ, అజిత్, సతీష్, అంజి తదితరులు పాల్గొన్నారు..

## వెదురు దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**-తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జొర్రిగల శ్రీనివాస్**




**హైదరాబాద్, సెప్టెంబర్ 03**
**నవసంఘర్షణ** సెప్టెంబర్ 18న నిర్వహించే ప్రపంచ వెదురు దినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జొర్రిగల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం బీసీ ప్రిన్సిపల్ సెక్రటరీ బాల మాయాదేవి, ఎంబీసీ కార్పొరేషన్ ఎండీ అలోక్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెదురు ఆధారిత వృత్తులు, వాటిపై ఆధారపడి జీవిస్తున్న మేదరి మహేంద్ర సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, వెదురు వృత్తికి ప్రభుత్వ ప్రోత్సాహం, వృత్తిదారుల సంక్షేమం తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించే అంశంపై సంబంధిత అధికారులతో చర్చించి, త్వరలో తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం ప్రతినిధులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేస్తామని ఎంబీసీ కార్పొరేషన్ ఎండీ అలోక్ కుమార్ హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. వెదురు దినోత్సవం అధికారికంగా నిర్వహించడం ద్వారా వెదురు వృత్తి, వెదురు ఉత్పత్తుల ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన పెరగడంతో పాటు, వృత్తిదారులకు ఉపాధి, ఆర్థికాభివృద్ధి అవకాశాలు మరింత మెరుగు పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రామగిరి మండలం నూతన అధ్యక్షునిగా ఎన్నికైన తులసి రామ్ గౌడ్



**రామగిరి, నవసంఘర్షణ**
స్వర్గీయ శ్రీపాద రావు ప్రియ శిష్యుడు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు,మరియు శీను బాబు ల నమ్మిన బంటు కాంగ్రెస్ పార్టీ విధేయుడు సీనియర్ నాయకుడు మాజీ ఉమ్మడి కమాన్పూర్ మండలం ఎంపీపీ కోరుకొప్పుల నీరజ తులసీరామ్ గౌడ్ ను రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియామకానికి సహకరించిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మరియు తెలంగాణ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మరియు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శీను బాబు మరియు రామగుండం ఎమ్మెల్యే జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మక్కన్ సింగ్ కు రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ పక్షానప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నేపాల్ వరద బాధితులకు కోసం లయన్స్ ఫౌండేషన్ రూ.1.89 కోట్ల విరాళం అందజేత

**-లయన్స్ సంస్థలో సభ్యులుగా పనిచేస్తున్నందుకు గర్వపడుతున్నాం**
**-లయన్ డా.శరణ్య మారుతి యాదవ్**



**రామగిరి, నవసంఘర్షణ**
నేపాల్‌లో సంభవించిన వరదలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు సహాయం అందించేందుకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ద్వారా రూ.1 కోటి 89 లక్షల విరాళం అందజేయడం అభినందనీయమని లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ప్రెసిడెంట్ లయన్ డా.శరణ్య మారుతి యాదవ్ అన్నారు.వరదల కారణంగా నేపాల్‌లో అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో,బాధితులకు అత్యవసర సహాయం,పునరావాసం మరియు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు ఎంతో ఉపయోగపడతాయని ఆమె తెలిపారు.ప్రపంచంలో ఎక్కడ విపత్తు సంభవించినా మానవతా దృక్పథంతో స్పందిస్తూ,బాధితులకు అండగా నిలిచే లయన్స్ వంటి గొప్ప సంస్థలో సభ్యత్వం తీసుకుని,లయన్స్ క్లబ్‌లో భాగస్వాములుగా సేవా కార్యక్రమాల్లో పనిచేస్తున్నందుకు మేమంతా గర్వపడుతున్నాము.సేవ,సహాయం, మానవత్వాన్ని ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకుని పనిచేస్తున్న ఇలాంటి గొప్ప సంస్థలో సభ్యులుగా ఉండటం మా అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు.
విపత్తు సమయంలో బాధితులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి మానవతా బాధ్యత అని ఆమె అన్నారు.సేవే లయన్స్ సంస్థకు ప్రధాన లక్ష్యమని తెలిపారు.వారి మార్గదర్శకం తో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ కూడా భవిష్యత్తులో సభ్యుల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి సమాజానికి తన వంతు సహకారం అందిస్తుందని తెలిపారు.

## ప్రతి ఒక్కరూ భాధ్యతగా మొక్కలు నాటాలి

**-పలు వార్డులలో వనమ హోత్సవ కార్యక్రమం నిర్వ హణ**




**నవసంఘర్షణ/మెట్ పల్లి సెప్టెంబర్ 3:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన వనమ హోత్సవ కార్యక్రమంలో భాగంగా మెట్‌పల్లి పట్టణం లోని 3,4,14,22,24 వార్డు లలో ఘనంగా మొక్కల పం పిణీ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి వార్డు ప్రజలకు మొక్కలను పంపి ణీ చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లా డుతూ పెరుగుతున్న కాలు ష్యాన్ని అరికట్టడానికి, భవి ష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణం అందించడానికి ప్రతి ఒక్క రూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను సం రక్షించే బాధ్యతను ప్రజలు తీసుకోవాలని ఆయన కోరా రు.ఈ కార్యక్రమంలో ము న్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిష నర్ శ్రీనివాస్ గౌడ్, స్థానిక వార్డు కౌన్సిలర్లు బత్తుల న రేష్, పందిరి రమేష్, గుడి కందుల అజయ్ అంగడి పు రుషోత్తం,మాసుల ప్రవీణ్ బంగారు కాళ్ళ కిషోర్, దొని కేలా శిరీష పూదరి జ్యోతి, కో ఆప్షన్ మెంబర్ గజం ల క్ష్మి ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు,ముజీబ్ వార్డు ఆఫీస ర్స్,అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు, వార్డు ప్రజలు మరియు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విశ్వశాంతిలో కృష్ణాష్టమి సందడి





**/రాయికల్ నవసంఘర్షణ**
పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ప్రధానోపాధ్యాయులు మచ్చగంగాధర్ గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సందడి చేస్తూ అందరిని ఆకట్టుకున్నారు. చిన్ని కృష్ణులు ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు మహేష్, రంజిత్, రజిత, సంజన, ఇందుజ, మంజుల, స్రవంతి, కవిత, సాయి హర్ష, దీపిక, శివాని, సౌజన్య, కళ్యాణి, మాలతి, అహల్య, గాయత్రి, గీతారాణి, ప్రవళిక, కావ్య, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## కూతురి రాజకీయ భవితవ్యం కోసమే!



నేడు రాష్ట్ర రాజకీయాలు కొండా ఫ్యామిలీ చుట్టూ తిరుగుతున్నాయి. ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో.. అధిష్టానం ఎటువైపుగా అడుగులు వేస్తుందో అని ఉత్కంటగా ఎదురు చూస్తున్నారు. కానీ కొండా దంపతులు తమ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బీసీ వర్గాల్లోని బలం, ప్రజా మద్దతును ఉపయోగించి కూతురికి స్వతంత్ర రాజకీయ వేదికను సిద్ధం చేయాలని భావిస్తున్నట్టుగా కూడా చర్చ జరుగుతోంది. కొత్త వేదిక ద్వారా ఆమెకు అవకాశం కల్పించాలనే ఆలోచన ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. బీసీల ఆత్మగౌరవం, ప్రాతినిధ్యం అజెండాగా కొత్త రాజకీయ శక్తిని నిర్మించే ప్రయత్నం కూడా ఈ కోణంలోనే చూడవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొండా సురేఖ రాజీనామా వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. కొండా సురేఖ మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలని, లేదంటే పార్టీ నుండి బర్తరఫ్ చేస్తామని పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేయటంతో కొండా కపుల్ రాజకీయ భవితవ్యం గందరగోళంలో పడింది. కూతురు చేసిన వ్యాఖ్యలు కొండా సురేఖ రాజకీయ జీవితాన్ని మార్చేస్తుంది అన్న చర్చ స్థానికంగా జోరుగా సాగుతోంది. చాలా కాలంగా కొండా కపుల్ తమ కుమార్తె పొలిటికల్ ఎంట్రీ కోసం ప్రయత్నం చేస్తున్నారు. గతంలోనూ బీఆర్ఎస్ లో ఉన్న సమయంలో కూడా కొండా సుస్మితకు టికెట్ కావాలని అధిష్టానం మీద ఒత్తిడి తెచ్చారు. కొండా సుస్మిత తన తల్లిదండ్రుల రాజకీయ వారసత్వాన్ని కొనసాగించాలనే ఆలోచనతో పరకాల నియోజకవర్గంపై గంపెడు ఆశలు పెట్టుకుంది. అయితే ఇటీవల సీఎం రేవంత్ పరకాలలో మళ్ళీ టికెట్ రేవూరి ప్రకాష్ రెడ్డికే అని ప్రకటన చేయటంతో సుస్మిత ఆశలమీద నీళ్ళు చల్లినట్టు అయ్యింది. దీంతో పొలిటికల్ ఫ్యూచర్ పైన ఆందోళనలో ఉన్న కొండా సుస్మిత సీఎం రేవంత్ రెడ్డిని తీవ్రస్థాయిలో టార్గెట్ చేశారు. సీఎంపై సుస్మిత చేసిన విమర్శలు పార్టీలో తీవ్ర అలజడి సృష్టించాయి. దీనితో కొండా సురేఖపై షోకాజ్ నోటీసు, పదవి నుంచి తొలగించాలనే డిమాండ్లు వచ్చాయి. అయితే కొండా దంపతులు తమ కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తాము బాధ్యులు కాదని, ఆమె స్వతంత్ర వ్యక్తి అని స్పష్టం చేశారు. వారు కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. కానీ కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించలేదు. ఒకవేళ అదే చేస్తే కూతురికి రాజకీయంగా అనవసరపు ఇబ్బంది వస్తుందని, కూతురి కోసం పోరాటమే చెయ్యాలని నిర్ణయం తీసుకున్నారు. కొండా దంపతులు తమ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బీసీ వర్గాల్లోని బలం, ప్రజా మద్దతును ఉపయోగించి కూతురికి స్వతంత్ర రాజకీయ వేదికను సిద్ధం చేయాలని భావిస్తున్నట్టుగా కూడా చర్చ జరుగుతోంది. కొత్త వేదిక ద్వారా ఆమెకు అవకాశం కల్పించాలనే ఆలోచన ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. బీసీల ఆత్మగౌరవం, ప్రాతినిధ్యం అజెండాగా కొత్త రాజకీయ శక్తిని నిర్మించే ప్రయత్నం కూడా ఈ కోణంలోనే చూడవచ్చు. తల్లిదండ్రులు తమ బిడ్డ రాజకీయ భవిష్యత్తు కోసం తమ పదవి, పార్టీలోని స్థానం, దశాబ్దాలుగా నిర్మించుకున్న రాజకీయ జీవితాన్ని రిస్క్ చేయటం మామూలు విషయం కాదు. కానీ కొండా దంపతులు ఈ రిస్క్ చేశారు. ఏదేమైనా ఎదో ఒక రచ్చతో నిత్యం ప్రజల మధ్యన హాట్ టాపిక్ గా నిలుస్తూ కొత్త రకం ప్రచారానికి తెర తీస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఊపందుకుంటున్నాయి. మంత్రివర్గం నుండి కొండా సురేఖకు ఉద్వాసన పలుకుతున్న క్రమంలో కొండా దంపతుల రాజకీయ భవితవ్యంపైన చర్చ జరుగుతోంది. మొదట నుండి వివాదాస్పదులే అయినప్పటికీ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బలమైన కేడర్, వరంగల్ లో బలమైన పట్టు, ఉన్న మంత్రి కొండా సురేఖ, కొండా మురళీ దంపతులు నూతన రాజకీయ శక్తిగా ఆవిర్భవించేందుకు సమాయత్తమవుతున్నారనే వార్తలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతున్నాయి. బీసీ వర్గాల హక్కులు, ఆత్మగౌరవమే ప్రధాన అజెండాగా వారు ఈ నిర్ణయం తీసుకోబోతున్నారని వారి అనుచరులు, శ్రేయోభిలాషులు చెబుతున్నారు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ సామాజిక వర్గాల ఆత్మగౌరవ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా వారు వ్యూహ రచన చేస్తున్నారని సమాచారం. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, పుష్కలమైన ప్రజా మద్దతు, అంగబలం, ఆర్థిక బలం తమకు అనుకూలంగా ఉన్నాయని కొండా దంపతులు భావిస్తున్నారు.ప్రస్తుతం బీసీ మేధావులు, శ్రేయోభిలాషులు, మద్దతుదారులతో విస్తృత స్థాయిలో సమాలోచనలు కొనసాగుతున్నాయి. కొండా దంపతుల నిర్ణయం బీసీల ఏకీకరణకు ఇది మంచి అవకాశం అని వారి మద్దతుదారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో మెజారిటీ జనాభా ఉన్న బీసీ వర్గాలను ఒకే వేదికపైకి తెచ్చి, వారికి తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించేందుకు ఈ చర్య దోహదపడుతుందని అంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలలో టికెట్లు దక్కక నిరాశలో ఉన్న సమర్థులైన నాయకులకు అవకాశం కల్పించి, వారిని గెలిపించుకునే వ్యూహంతో ముందుకు వెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. కోదండరామ్, కవిత, తీన్మార్ మల్లన్న వంటి నాయకులు స్వంత వేదికల ద్వారా గుర్తింపు పొందినట్లే, దశాబ్దాలుగా ప్రజాదరణ ఉన్న తాము కూడా స్వతంత్రంగా ముందుకు రావాలనే ఆలోచన కొండా దంపతుల్లో ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. ప్రకటన అనంతరం నేరుగా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు కూడా ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరి కొండా దంపతులు కొత్త రాజకీయ పార్టీ పెడితే వారి వెంట నడిచేవారు ఎందరు? వారు ఈ ప్రయత్నంలో సక్సెస్ అవుతారా అన్న చర్చ కూడా సాగుతుంది. అయితే, దీనిపై కొండా కుటుంబం నుండి అధికారిక ప్రకటన ఇంకా రాలేదు.ం

# వయసును మించిన మైనర్ల నేరాలు



మైనర్లుగా పరిగణించే 18 ఏళ్ల లోపు పిల్లలు సాధారణంగా తెలిసీ తెలియని వయసులో చేసే చిన్న చిన్న దొంగతనాలు, పిల్లల మధ్య గొడవలు, తొందరపాటుతో ఇతరులను గాయపరచడం లాంటి నేరాలు చేస్తుంటారు. వారిని శిక్షించడం కోసం ప్రభుత్వం బాల నేరస్థుల చట్టాలను రూపొందించింది. పిల్లల నేరాలు చట్టపరిధిలోకి వస్తే వారిని జువైనల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం విచారించి, బాల నేరస్థుల గృహాలకు పంపుతారు. అక్కడ కొంతకాలం వారికి తప్పొప్పుల విచక్షణ, అవగాహనలు నేర్పి వదిలేస్తారు. కేసులు నమోదైన మైనర్లకు బెయిల్ నిరాకరణ ఉండదు. జువైనల్ హోమ్‌లో శిక్ష కాలం కూడా తక్కువగా ఉంటుంది. మైనర్ల నేరాలను తెలియక చేసిన తప్పులుగా భావించే చట్టాలు వారి పట్ల ఎంతో దయాగుణంతో వ్యవహరిస్తున్నాయి.అయితే గత కొన్నేళ్లుగా మాత్రం మైనర్ల నేరాలు హద్దులు దాటుతున్నాయి. మేజర్లు చేసే నేరాలకు వారు కూడా పాల్పడుతున్నారు. 2025 లో దేశంలో రికార్డు అయిన మైనర్ల నేరాల్లో 144 హత్యలు, 58 అత్యాచారాలు ఉన్నాయి. గత పదేళ్ల కాలంలో మన దేశంలో మైనర్లు పాల్పడుతున్న నేరాల సంఖ్య కూడా 30 % పెరిగిందని నేషనల్ క్రైం రికార్డ్ బ్యూరో ప్రకటించింది. వాటిలో హత్యలు, అత్యాచారాలు, మాదకద్రవ్యాల వాడకం లాంటి తీవ్రమైన నేరాలు కూడా ఉండడం ఆందోళన కలిగించే విషయం. మైనారిటీ తీరనివాళ్ళు ఇలాంటి ఘోరాలు చేసి చట్టానికి, సమాజానికి సవాలుగా నిలుస్తున్నారు. వీరికి ఎలాంటి శిక్షలు వేయాలో అర్థం కాక న్యాయశాస్త్రాలు తికమక పడుతున్నాయి. బాల నేరస్థులను వయసు రీత్యా విభజిస్తే 16 - 18 ఏళ్లవారు 79% ఉన్నారని క్రైమ్ రేట్ రికార్డుల్లో ఉంది. 2012 లో జరిగిన నిర్భయ కేసులో ఆరుగురు నేరస్థుల్లో ఒకరు 17 ఏళ్ల మైనర్. అతడు కూడా మేజర్ల మాదిరే క్రూరంగా వ్యవహరిస్తూ ఆమెను ఇనుప కడ్డీతో తలపై కొట్టాడని విచారణలో తేలింది. మిగితా వారి మాదిరే ఈ మైనర్‌ను కూడా కఠినంగా శిక్షించాలని సమాజం నుండి ఒత్తిడి వచ్చింది. కోర్టు మాత్రం జువైనల్ జస్టిస్ బోర్డు సూచనల ప్రకారం 3 సంవత్సరాలు జైలు శిక్ష వేసింది. ఆయన వివరాలు ఎవరికీ తెలియకూడదని విడుదల సమయంలోనూ ఒక రోజు ముందుగా రహస్య ప్రదేశానికి తరలించారు. 2024 లో పుణెలో 17 ఏళ్ల అబ్బాయి మద్యం మత్తులో కారు నడుపుతూ బైకును ఢీకొని ఇద్దరి మరణానికి కారకుడయ్యాడు.

మైనర్ అయినందువల్ల ఆయనకు మర్నాడే బెయిల్ లభించింది. శిక్షలో భాగంగా న్యాయమూర్తి ఆయనను రోడ్డు ప్రమాదాలపై 300 పదాల వ్యాసం రాయమన్నారు. ప్రస్తుతం ఆ 'బాలుడు' తన ఇంట్లో హాయిగా ఉంటున్నాడు. హర్యానాలో ఇంటర్ విద్యార్థులు తమను బుద్ధిగా ఉండమని చెప్పిన ప్రిన్సిపాల్‌ను పొడిచి చంపారు. మేజరుకి దగ్గరవుతున్న దశలో మైనర్లు ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారు. సరియైన స్పృహ, బుద్ధి, జ్ఞానం ఉండే వారు ఇలాంటి నేరాలు చేస్తున్నారని విచారణ సమయంలో బయటపడుతోంది. ఆధునిక సాంకేతిక వ్యవస్థ, సమాజంలో పెరిగిన నేర ప్రవృత్తి, కుటుంబాల్లో పిల్లలకు ఇస్తున్న స్వేచ్ఛ, హింస ప్రేరేపిత సినిమాలు.. ఇలా వివిధ ప్రభావాలకు లోనై మైనర్లు వయసుకు మించిన తప్పుడు పనులు చేస్తున్నారు. హత్యలు, అత్యాచారాలు చేయడానికి భయపడడం లేదు. పర్యవసానాల పట్టింపు లేదు. జువైనల్ హోమ్ తరగతులు, మామూలు శిక్షలు సరిపోక వీళ్లు మళ్లీ అవే నేరాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తమకు వేసే శిక్షలు చిన్నవే అనే ధీమా వీరిని తిరిగి తప్పులు చేసేందుకు ప్రేరేపిస్తోంది. 2015 లో బాలల నేరాల చట్టంలో తెచ్చిన సవరణ ప్రకారం 16- 18 ఏళ్ల మైనర్లు చేసిన నేరాన్ని బట్టి వారిని మేజర్లుగా పరిగణించి శిక్షించవచ్చు. అయితే ఇది పూర్తిగా న్యాయమూర్తి పరిశీలనకు వదిలేయబడింది. నేరం పట్ల అవగాహన, పర్యవసానాలు తెలిసేంత మానసిక పరిపక్వత, శారీరక ఎదుగుదల ఆ మైనర్‌కు ఉన్నట్లు న్యాయమూర్తి భావిస్తే మేజర్‌గా విచారణ చేపట్టవచ్చు. బీహార్‌లో తోటి బాలుడిని గొంతు కోసి చంపిన కేసులో నిందితుడైన 16 ఏళ్ల మైనర్‌ను వయోజనుడిగా విచారణ జరపాలని ఈ మధ్య పాట్నా హైకోర్టు నిర్ణయించింది. దాన్ని సవాలు చేస్తూ పిటిషన్ సుప్రీం కోర్టుకు వచ్చింది. బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం హత్య ఎవరు చేసినా తీవ్రమైన నేరంగానే పరిగణించాలని ధర్మాసనం ఆ అభ్యర్థనను తోసిపుచ్చింది. 17 ఏళ్లకే హత్య కేసులో నిందితుడైన మైనర్ మేజర్ కిందే లెక్క అన్న పాట్నా హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించి సుప్రీం ఈ చట్ట సవరణకు బలాన్ని చేకూర్చింది. పెద్దవాళ్లు చేస్తున్నట్లుగా పిల్లలు కూడా తీవ్రమైన నేరాలు చేస్తుంటే చట్టం వయసు పట్టింపు లేకుండా కఠిన శిక్షలు వేస్తేనే నేరాల కట్టడి జరుగుతుంది. హత్యలు, లైంగిక అత్యాచారాలు తెలియనితనంతో చేసే నేరాలు కావు. ఎవరు చేసినా అవి క్షమార్హత లేని, తీవ్రమైన సామాజిక ద్రోహ చర్యలే. బాలనేరస్థులు అని కొంతకాలం జువైనల్ హోమ్ లో ఉంచుకొని వదిలేస్తే వీరివల్ల సమాజానికి మరింత హాని జరిగే అవకాశం ఉంది. పిల్లలను శిక్షించరు అనే ధీమాతో మరింత మంది మైనర్లు నేరాలను పాల్పడే అవకాశం ఉంది. అలా పిల్ల నేరగాళ్ల సంఖ్య పెరిగిపోతోంది. మారుతున్న కాలం ప్రకారం హత్య, లైంగిక బలాత్కారాలు, మాదకద్రవ్యాలు లాంటి నేరాల్లో మైనర్లకు వెసులుబాటు లేకపోవడమే సమాజానికి శ్రేయస్కరం.

# ఓటర్ల తొలగింపు.. 'ఇసి'కే తలవంపు

దేశంలో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పునః పరిశీలన (సర్) కార్యక్రమం, భారత గణతంత్రం ఏర్పడిన తరువాత ఎదురైన పెద్ద సవాలు. ఎందుకంటే ఓటర్ల జాబితాలనుంచి భారీ సంఖ్యలో పేర్లు తొలగిపోతున్నాయి. అంతేకాకుండా, ఈ ప్రక్రియను ఎన్నికల కమిషన్ నిర్లక్షంగా, బాధ్యతారహితంగా నిర్వహిస్తోందన్న తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఏవో కొన్ని అనుమానాలతో, సరైన ఆధారాలు లేని సాకులతో ప్రజలను ఓటు హక్కుకు దూరం చేయడం, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి పునాదులైన మూల సూత్రాలనే దెబ్బతీస్తోంది. ఇంకా దారుణమైన విషయం ఏమిటంటే, తమ ప్రజాస్వామ్య హక్కును తిరిగి పొందడానికి నిరుపేద, నిస్సహాయ ఓటర్లు అంతులేని న్యాయ ప్రక్రియల్లో చిక్కుకుపోతుండగా, ఎన్నికల కమిషన్ మాత్రం దీనిని తన గొప్ప విజయంగా ప్రపంచవ్యాప్తంగా ప్రచారం సాగించడం గమనార్హం. ఎన్నికల కమిషన్ ఓటర్లను ఎన్నుకునే పరిస్థితి ఏర్పడింది. న్యాయ వ్యవస్థ కూడా దీనికి ఇష్టాపూర్వకంగా సహకరించే పాత్రను పోషిస్తున్నట్టు రూఢి అవుతోంది. ఇక ప్రభుత్వం ఈ పరిస్థితిని చూసి ఎంతో సంతోషంగా ఉన్నట్టు కనిపిస్తోంది. 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితాల సవరణ మూడో దశలో సుమారు 36కోట్ల మంది పేర్లతో ఉన్న ఓటర్ల జాబితానుంచి 6కోట్ల మంది పేర్లు తొలగించబడినట్టు అంచనా. ఈ ప్రక్రియలో దేశరాజధాని ఢిల్లీలో ప్రతి ముగ్గురు ఓటర్లలో ఒకరిని ఓటు వేయడానికి అనర్హులుగా ప్రకటించారు. ఓటర్ల జాబితా సవరణలో ఓటరు ఆ ప్రాంతంలో నిజంగా నివసిస్తున్నారా లేదా, ఒకే వ్యక్తి పేరు ఎక్కువ చోట్ల ఉందా? తదితర అంశాలను పరిశీలిస్తారు. చిరునామా మారిన వారు, లేదా ఆ ప్రాంతంలో నివసించని వారి వివరాలను సరిచేస్తారు. అవసరమైన పత్రాలు, ధ్రువీకరణ అందించని, లేదా అర్హతను నిరూపించలేని వారి పేర్లు తొలగించవచ్చు. ఈ నేపథ్యంలో 6కోట్ల పేర్లు తొలగించబడ్డాయంటే ఆ ఆరు కోట్ల మంది ఓటు హక్కును శాశ్వతంగా కోల్పోయారని అర్థం కాదు. కొందరి పేర్లు తప్పుగా తొలగించి ఉండవచ్చు. కొందరు వేరే ప్రాంతానికి





మారి ఉండవచ్చు. మరికొందరు కావలసిన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోయి ఉండవచ్చు. తుది ఓటర్ల జాబితా, అభ్యంతరాలు, అప్పీళ్ల ప్రక్రియ తర్వాత సంఖ్య మారవచ్చు. మహారాష్ట్రలో 2కోట్లకు పైగా ఓటర్ల పేర్లను జాబితాలనుంచి తొలగించారు. కర్ణాటకలో 1.07కోట్లు, తెలంగాణలో 73లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లో 44లక్షలు, జార్ఖండ్‌లో 43లక్షల పేర్లు మహారాష్ట్రలో 2కోట్లకు పైగా, ఓటర్లను తొలగించారు. కొన్ని నెలల క్రితం పశ్చిమబెంగాల్ శాసనసభ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా నుంచి దాదాపు 90 లక్షల మంది పేర్లు తొలగించారు. ఈ విధంగా ఓటు హక్కును కోల్పోయిన వారందరికీ ఎన్నికలు జరగక ముందే ట్రైబ్యునళ్ల ముందు తమ వాదనను వినిపించే అవకాశం ఎన్నికల సంఘం కల్పించకపోవడం విడ్డూరం. ఎన్నికలు జరిగే సమయానికి కేవలం కొన్ని వేల అప్పీళ్లను మాత్రమే విచారించారు. ఇప్పుడు కొత్తగా వెలుగులోకి వచ్చిన విషయం ఏమిటంటే పశ్చిమ బెంగాల్ లోని 'సర్' అప్పీలు ట్రైబ్యునళ్లకు ఓటు హక్కును పునరుద్దరించాలని అప్పీలు చేసిన 82,782 మందిలో 75,443 మందికి తిరిగి ఓటు హక్కును కల్పించడం విశేషం. అంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుకు అనర్హులుగా ప్రకటించిన వారిలో 91శాతం మంది విషయంలో అన్యాయం జరిగినట్టే కదా! వీరి పేర్లను ఓటర్ల జాబితానుంచి అన్యాయంగా, అప్రజాస్వామికంగా, చట్ట విరుద్ధంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఎన్నికల సంఘం తొలగించిందని బయటపడింది. కానీ వీరికి న్యాయమైన విచారణకు సుప్రీం కోర్టు అవకాశం కల్పించలేదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించే చట్టబద్ధమైన అధికారం తనకు ఉందని ఎన్నికల సంఘం చెబుతోంది. ఆ అధికారంపై ఎవరూ అభ్యంతరం చెప్పడంలేదు. అయితే ఓటర్ల జాబితాను సవరించడం అంటే ప్రజల ఓటు హక్కును తొలగించడం కాదు. ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలు అనేక రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రజలకు ఉన్న ఇతర హక్కులు, ప్రభుత్వ సేవలను నిరాకరించే అవకాశం కల్పించాయి. ఉదాహరణకు పాస్‌పోర్ట్ పునరుద్ధరణ, రేషన్ కార్డు పొందడం, ప్రభుత్వ పథకాల కింద బియ్యం పొందడం వంటి వాటిని కూడా నిరాకరించే పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ స్వయంగా ఓటర్ల జాబితాను పౌరసత్వంతో ముడిపెడుతున్నారు. కానీ పౌరసత్వం అనేది ఎన్నికల కమిషనర్ పరిధి లోని విషయం కాదు. ఓటర్ల జాబితాలో తమ పేరు ఉండటానికి తాము అర్హులమని ఓటర్లే నిరూపించుకోవాలని ఎన్నికల సంఘం చెప్పడం ఓటర్ల హక్కులకు ముప్పుగా పరిణమిస్తోంది. సహజమైన న్యాయం, సాధారణ విజ్ఞత ప్రకారం చూస్తే ఎవరిపేరైనా ఓటర్ల జాబితా నుంచి తొలగించే ముందు ఎన్నికల సంఘం తగిన ఆధారాలను చూపించగలగాలి. ఎందుకంటే ఓటర్ల జాబితాను తయారు చేసేది ఎన్నికల సంఘమే. అందువల్ల ప్రజల ఓటు హక్కును హరించే విధంగా ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్రియ తాను రూపొందించిన వ్యవస్థనే బలహీనపరుస్తోందని చెప్పవచ్చు. ఓటు హక్కు అనేది పిల్లల ఆట కాదు. దానిని తేలికగా తీసుకోలేం. ఎన్నికల సంఘానికి ఈ విషయం అర్థం కాకపోతే, సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని రాజ్యాంగం ఏం చెబుతోందో స్పష్టంగా గుర్తు చేయాల్సిన అవసరం వస్తుంది. భారత రాజ్యాంగ వ్యవస్థలో రాజకీయ అధికారానికి ప్రజలే మూలం. అర్హులైన పౌరులు ఓటు వేయలేని పరిస్థితి ఏర్పడితే ప్రజాస్వామ్య ప్రాతినిధ్యమే దెబ్బతింటుంది.

# ఇండిగో ఫ్లైట్ గాలిలో ఉండగా పైలట్‌కు అస్వస్థత..

## అత్యవసరంగా దారి మళ్లింపు

**న్యూఢిల్లీ:**
ఇండిగో విమానం గాలిలో ఉండగా పైలట్ అస్వస్థత చెందారు. ఈ నేపథ్యంలో ఆ విమానాన్ని అత్యవసరంగా దారి మళ్లించారు. అందులోని ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చేందుకు కొత్త సిబ్బందితో కూడిన మరో విమానాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ పేర్కొంది. గురువారం తెల్లవారుజామున 3 గంటలకు ఖతార్ రాజధాని దోహా నుంచి బెంగళూరు వెళ్లే ఇండిగో విమానం




టేకాఫ్ అయ్యింది. అయితే దోహా ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన రెండు గంటల తర్వాత ఆ విమానం గాలిలో ఉండగా ఒక పైలట్ అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో అత్యవసర పరిస్థితి 'మేడే' అని ప్రకటించారు.కాగా, ఆ ఇండిగో విమానాన్ని అత్యవసరంగా వెనక్కి మళ్లించారు. ఒమన్ రాజధాని మస్కట్ ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండ్ చేశారు. అక్కడ చిక్కుకున్న ప్రయాణికులను బెంగళూరు తరలించేందుకు ప్రత్యామ్నాయ విమానం, కొత్త సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఇండిగో తెలిపింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు పేర్కొంది. తమ ప్రయాణికులు, సిబ్బంది, విమానం భద్రతకు అత్యంత ప్రాధాన్యత అని ఇండిగో ప్రకటించింది.

# పంజాబ్ సీఎంపై బీజేపీ సంచలన ఆరోపణలు

**5 కోట్లకు రేప్ కేసులు సెటిల్ చేస్తున్నారు**

**ఆడియో క్లిప్‌లను విడుదల చేసిన బీజేపీ**




**న్యూఢిల్లీ నవ సంఘర్షణ**

పంజాబ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగింది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆయన భార్య గురుప్రీత్ కౌర్‌పై బీజేపీ సంచలన ఆరోపణలు చేసింది. మధ్యవర్తుల ద్వారా అత్యాచారం కేసులను రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారని ఆరోపించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ గురువారం మీడియా సమావేశంలో ఈ ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా కొన్ని ఆడియో క్లిప్‌లను కూడా భండారీ విడుదల చేశారు. అందులో ఓ వ్యక్తి తన రాజకీయ పలుకుబడిని ప్రస్తావిస్తూ అత్యాచారం, ఇతర క్రిమినల్ కేసులను పరిష్కరించగలమన్నట్లు మాట్లాడుతున్నారని బీజేపీ తెలిపింది. అయితే ఈ ఆడియోలో భగవంత్ మాన్, గురుప్రీత్ కౌర్ పేర్లు ఎక్కడా ప్రస్తావనకు రాలేదు. ఆ క్లిప్‌ల ఆధారంగానే సీఎం పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని బీజేపీ పేర్కొంది. ఈ వ్యవహారం ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ గుర్విందర్ సింగ్ చాహల్ కేసుతో ముడిపడి ఉంది. ఓ మహిళను అపహరించి అత్యాచారం చేశారనే ఆరోపణలపై చాహల్‌ను పంజాబ్ పోలీసులు కొన్ని నెలల క్రితం అరెస్టు చేశారు. అయితే ఈ వారం ప్రారంభంలో ఆయన్ను పోలీసులు విడుదల చేశారు. దీనిపై కూడా రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి. "భగవంత్ మాన్, ఆయన భార్య మధ్యవర్తుల ద్వారా డబ్బులు వసూలు చేస్తూ కేసులను సెటిల్ చేస్తున్నారని" భండారీ ఆరోపించారు. రూ.5 కోట్లకు అత్యాచారం కేసులను పరిష్కరిస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నివాసం నుంచే ఇలాంటి వ్యవహారాలు నడుస్తున్నాయా? అని బీజేపీ ప్రశ్నించింది. ఈ ఆరోపణలపై పంజాబ్ ప్రభుత్వం, భగవంత్ మాన్ నుంచి తక్షణ స్పందన వెలువడినట్లు సమాచారం లేదు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసింది.

# ప్రైవేట్ ఎయిర్‌లైన్స్‌లో అభినందన్ చేరిక


**ఐఏఎఫ్ నుంచి మార్చిలోనే రిటైర్**



**న్యూఢిల్లీ నవ సంఘర్షణ**

2019 బాలాకోట్ వైమానిక దాడిలో పాకిస్థాన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానాన్ని కూల్చివేసిన ఫైటర్ పైలట్ అభినందన్ వర్ధమాన్ ప్రైవేట్ సంస్థలో పైలట్ గా చేరినట్టు తెలుస్తున్నది. ఈ ఏడాది మార్చిలో ఐఏఎఫ్ నుంచి రిటైరైన 43 ఏండ్ల అభినందన్ గత నెల్లో ఫ్లై91 అనే ప్రైవేట్ విమానయాన సంస్థలో చేరినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఆయన పాత్ర లేదా విమానయాన బాధ్యతల గురించి తక్షణ వివరాలు ఏవీ అందుబాటులో లేవు.

# లా విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బార్ కౌన్సిల్‌కు లేదు..



**న్యూఢిల్లీ నవ సంఘర్షణ**

లా విద్యార్థులపై చర్యలు తీసుకునే చట్టబద్ధమైన అధికారం బీసీఐ (బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా)కు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వారు విద్యార్థులు అని, వారంతా సంబంధిత యూనివర్సిటీలు, విద్యా సంస్థల పరిధిలోని వస్తారని వెల్లడించింది. ఇటీవల నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థుల అంశంలో చెలరేగిన వివాదంపై విచారణ సందర్భంగా కోర్టు తాజా సూచనలు చేసింది. హైదారాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో 2026 లా గ్రాడ్యుయేట్ విద్యార్థుల స్నాతకోత్సవం జరగాల్సి ఉంది. దీనికి సీజేఐ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించింది. అయితే, ఆయనను చీఫ్ గెస్టుగా రావడాన్ని విద్యార్థులు వ్యతిరేకించారు. దీంతో కార్యక్రమం రద్దైంది. ఆ తర్వాత బెంగళూరు లా విద్యార్థులు కూడా ఇలాగే చేశారు. అయితే, నల్సార్ విద్యార్థుల వైఖరిపై బీసీఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విద్యార్థుల్ని ఎన్‌రోల్ చేయకూడదని లాయర్లకు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విద్యార్థులు, న్యాయ కోవిదుల నుంచి వ్యతిరేకత రావడంతో వెంటనే ఆ నిర్ణయాన్ని బీసీఐ వెనక్కు తీసుకుంది. అయితే, సీజేఐ రాకను అడ్డుకున్న లా విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి మోహన ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరిపింది. విద్యార్థులపై చర్యలు తీసుకునే చట్టబద్ధమైన హక్కు బీసీఐకి లేదా రాష్ట్ర బార్ కౌన్సిల్స్‌కు లేదని వివరించింది. వారు విద్యార్థులు అని, వారిపై చర్యలు తీసుకునే హక్కు సంబందిత యూనివర్సిటీలకే ఉంటుందని పేర్కొంది. ఒకవేళ వారు అడ్వకేట్లుగా ఎన్‌రోల్ అయితే, అప్పుడు వారిపై చర్యలు తీసుకునేందుకు బీసీఐకి హక్కు ఉంటుందని వెల్లడించింది.

# సీజేపీలో రెబల్ వర్గం..

# కొత్తగా సీజేపీ-డీ ఏర్పాటు

**న్యూఢిల్లీ నవ సంఘర్షణ**

జంతర్‌మంతర్ వద్ద జెన్ జెడ్ నిరసనలతో దేశవ్యాప్తంగా ప్రచారం పొందిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)లో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో రెబల్ వర్గం పుట్టుకొచ్చింది. కాక్రోచ్ జనతా పార్టీ-డెమోక్రటిక్ (సీజేపీ-డీ) పేరుతో కొత్త వర్గం ఏర్పాటైంది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేతో పాటు జంతర్‌మంతర్ వద్ద నిరసన సందర్భంగా ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రిలో చేరిన మనీష్ బ్రహ్మభట్ ఈ రెబల్ వర్గాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఢిల్లీలో 'సీజేపీ-డీ' ఏర్పాటు సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఈ రోజు కాక్రోచ్ జనతా పార్టీ-డెమోక్రటిక్ (సీజేపీ-డీ)ని మేం ప్రారంభిస్తున్నాం' అని ఆయన ప్రకటించారు. ప్రజల రక్తం, చెమటతో నిర్మితమైన ఉద్యమం నుంచి ఉద్భవించిన అసలు 'కాక్రోచ్ జనతా పార్టీ' బృందం, తదనంతరం కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీ కోసం ప్రత్యేకంగా ఎంపిక చేసిన బృందంగా మారిపోవడమే సీజేపీ-డీ ఏర్పాటుకు కారణమని వివరించారు. కాగా, ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై మనీష్ బ్రహ్మభట్ పలు విమర్శలు చేశారు.





నిరసనకారులను పక్కనపెట్టి, యువత నేతృత్వంలోని ఈ ఉద్యమాన్ని తమకు నచ్చిన వారితో కూడిన 'కేజ్రీవాల్ టీమ్'గా సీజేపీని దీప్కే మార్చేశారని ఆయన ఆరోపించారు. ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ఆప్ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసే వ్యక్తులు అసలు ఉద్యమాన్ని తమ గుప్పిట్లోకి తీసుకున్నారని ఆయన మండిపడ్డారు. మరోవైపు సీజేపీ జాతీయ స్థాయి నాయకత్వ బృందం కూర్పును మనీష్ బ్రహ్మభట్ ప్రశ్నించారు. జంతర్ మంతర్ ఆందోళనకు మద్దతు ఇచ్చిన ప్రజలకు, వర్గాలకు ఇందులో ప్రాతినిధ్యం లభించలేదని ఆరోపించారు. 'రాజకీయ ఒప్పందాలు చేసుకోవడమే వారి లక్ష్యం. విద్యార్థులు లేదా ఇతర రాష్ట్రాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల కోసం పోరాడటంలో వారికి ఎలాంటి ఆసక్తి లేదు. దానికి బదులుగా, కేవలం కేజ్రీవాల్ ఆదేశాల మేరకు నడుస్తూ, బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న పార్టీలకు మద్దతు ఇచ్చేందుకే వారు బీజేపీని వ్యతిరేకించాలనుకుంటున్నారు' అని విమర్శించారు. సీజేపీ కేంద్ర బృందానికి ఎంపికైన ఎనిమిది మందికి ఆప్‌తో సంబంధాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. కాగా, ఆగస్టులో అభిజిత్ దీప్కే నివాసంలో నిర్వహించిన సీజేపీ కోర్ టీమ్ సమావేశం గురించి తెలుసుకున్న మనీష్ బ్రహ్మభట్ గుజరాత్ నుంచి మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌కు చేరుకున్నారు. జంతర్ మంతర్ నిరసనల్లో చురుకుగా పాల్గొన్న వాలంటీర్లను చర్చలకు దూరంగా ఉంచారని ఆయన ఆరోపించారు. తన సహచరుడు రాహుల్ పాండ్యాతో కలిసి నాడు దీప్కే ఇంటి వద్ద నిరసన చేపట్టిన మనీష్, తాజాగా సీజేపీ రెబల్ వర్గమైన (సీజేపీ-డీ)ని ఏర్పాటు చేశారు. అయితే సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఆయన టీమ్ ఈ రెబల్ వర్గం ఏర్పాటుపై ఇంకా స్పందించలేదు.

# టిబెట్‌లో భూకంపం..

**నేపాల్ సరిహద్దు ప్రాంతంలో**
**5.0 తీవ్రత నమోదు**

**న్యూఢిల్లీ నవ సంఘర్షణ**

టిబెట్‌లో గురువారం భూకంపం సంభవించింది. నేపాల్ సరిహద్దులో 5.0 తీవ్రతతో భూకంపం నమోదైంది. ఈ భూకంపం కారణంగా నేపాల్‌లోనే మరోసారి ప్రజల్లో ఆందోళన నెలకొంది. గత వారమే నేపాల్‌లో భారీ వరదలు సంభవించి 1200 మందికిపైగా మరణించిన సంగతి తెలిసిందే. ఈ వరదలకు గల కారణాలపై ఇంకా ఒక స్పష్టత లేదు. అలాంటిది మరోసారి అదే నేపాల్ సరిహద్దు ప్రాంతంలో.. టిబెట్ దేశంలో భూకంపం నమోదు కావడం ఆందోళనకు గురిచేసింది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.46 గంటల సమయంలో,



భూమికి 14 కిలో మీటర్ల లోతున ఈ భూకంపం నమోదైనట్లు ఇండియాకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. అయితే, ఈ భూకంపం వల్ల ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవించలేదని తెలిపింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాల్ని టిబెట్ ఇంకా వెల్లడించాల్సి ఉంది. గత ఆగస్టు 26న నేపాల్ సరిహద్దు ప్రాంతంలో, టిబెట్‌లో ఒక మంచు ఫలకం కూలిపోయింది. దీంతో పర్వత ప్రాంతంలోని నదులు ఉప్పొంగి పెద్ద విధ్వంసం సంభవించిన సంగతి తెలిసిందే. నేపాల్‌తోపాటు టిబెట్‌లోనూ వరద ప్రభావం కనిపించింది. ఇక, నేపాల్ మృతుల సంఖ్య 1,252కు చేరింది. ఇంకా మృతదేహాల వెలికితీత కొనసాగుతోంది. మరోవైపు మళ్లీ నేపాల్‌కు వరద ముప్పు పొంచి ఉంది. అనేక నదులు పొంగి ప్రవహించే ప్రమాదం ఉంది. ఇంకా అక్కడ వర్షాలు పడుతుండటంతో భోటెకోషి నది ఉప్పొంగుతోంది. మంచు పర్వతం కూలడం వల్లే ఇటీవల నేపాల్‌లో వరదలు సంభవించాయనే ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ విషయంలో నిపుణుల నుంచి ఇంకా ఏకాభిప్రాయం రావాల్సి ఉంది.

# అమెరికా, కెనడాల నుంచి లండన్‌కు 86 టన్నుల పసిడి..

## తరలించిన నెదర్లాండ్స్ సర్కారు..!

**న్యూఢిల్లీ నవ సంఘర్షణ**

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో నెదర్లాండ్స్ ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయాన్ని అమలు చేసింది. అమెరికా , కెనడా దేశాల్లో నిల్వ ఉంచిన తమ 86 టన్నుల పసిడి నిల్వలను బ్రిటన్ రాజధాని లండన్ లోని 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ' వాల్ట్‌కు విజయవంతంగా తరలించినట్లు డచ్ సెంట్రల్ బ్యాంక్ అధికారికంగా ధ్రువీకరించింది. సంక్షోభ సమయంలో ఈ పసిడిని అత్యంత వేగంగా ట్రేడింగ్ చేయడానికి, నగదు రూపంలోకి మార్చుకోవడానికి వీలుగానే ఈ క్లిష్టమైన ఆపరేషన్‌ను పూర్తి చేసినట్లు బ్యాంక్ గవర్నర్ ఒలాఫ్ స్లీపెన్ వెల్లడించారు. ఈ భారీ తరలింపు ప్రక్రియను ఈ ఏడాది మార్చి నుంచి ఆగస్టు మధ్య కాలంలో రెండు విభిన్న పద్ధతుల్లో అత్యంత జాగ్రత్తగా నిర్వహించారు. మొదటగా అమెరికా, కెనడాలలోని బ్యాంకుల నుంచి సుమారు 27 టన్నుల భౌతిక (ఫిజికల్) బంగారాన్ని నెదర్లాండ్స్‌లోని జైస్ట్ (వఆర్) ప్రాంతానికి తీసుకొచ్చి, అక్కడి నుంచి లండన్‌లోని




బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌కు భద్రంగా చేర్చారు. ఇక మిగిలిన పసిడికి సంబంధించి రవాణా ప్రమాదాలను తగ్గించేందుకు న్యూయార్క్‌లో ఉన్న గోల్డ్ బార్‌లను అక్కడే విక్రయించి, సమాన పరిమాణంలోని అంతర్జాతీయ ప్రామాణిక బంగారాన్ని తిరిగి లండన్ మార్కెట్‌లో కొనుగోలు చేశారు. ఈ విధానంవల్ల బంగారాన్ని కరిగించాల్సిన అవసరం లేకుండానే సమర్థవంతంగా లండన్‌కు తరలించడం సాధ్యమైంది. ప్రస్తుతం అమెరికా-కెనడా మధ్య నడుస్తున్న వాణిజ్య పోరు, పశ్చిమాసియాలో ఇరాన్ ఉద్రిక్తతలు, అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న ఆందోళనల మధ్య డచ్ బ్యాంక్ ఈ చర్యకు పూనుకోవడం అంతర్జాతీయంగా తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత లిక్విడిటీ ఉన్న గోల్డ్ మార్కెట్‌గా లండన్ గుర్తింపు పొందింది. లండన్‌లోని 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్' అధునాతన బాంబ్-ప్రూఫ్ వాల్ట్‌లలో ప్రపంచ పసిడి నిల్వల్లో దాదాపు ఐదో వంతు భద్రపరచబడి ఉంది. ఇక్కడ వివిధ దేశాల కేటాయింపులు పక్కపక్కనే ఉండటంతో అత్యవసర సమయాల్లో భౌతికంగా బంగారాన్ని రవాణా చేసే పనిలేకుండా, వాల్ట్‌లోని అరలు మార్చడం ద్వారానే వేల కోట్ల విలువైన అంతర్జాతీయ లావాదేవీలను క్షణాల్లో పూర్తి చేయడానికి వీలవుతుంది.

# గొడ్డుచాకిరీలో భారతే ఫస్ట్

**వారానికి 16 వేతనం**
**లేని పని గంటలు : ఏడీపీ నివేదిక**

**న్యూఢిల్లీ, నవ సంఘర్షణ**

ఉద్యోగులు, కార్మికులతో గొడ్డుచాకిరీ చేయించుకుంటున్న దేశాలలో భారత్ ప్రపంచ దేశాల్లో మొదటి స్థానంలో ఉంది. వారానికి 16 అంతకన్నా ఎక్కువ వేతనం లేని పనిగంటలతో భారత్ తొలిస్థానాన్ని ఆక్రమించిందని పీపుల్స్ ఎట్‌వర్క్ 2026 పేరిట ఏడీపీ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. దేశంలోని 24 శాతం మంది కార్మికులు ప్రతి వారం 16, అంతకన్నా ఎక్కువ గంటలు ఎలాంటి వేతనం పొందకుండానే తమ సేవలు అందిస్తున్నారని, మరో 40 శాతం మంది వారానికి ఆరు నుంచి 15 గంటలు వేతనం లేని పనిగంటలతో శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆ నివేదిక వెల్లడించింది. అంటే భారతదేశంలోని



శ్రామికశక్తిలో గణనీయమైన భాగం తాము పనిచేసే గంటలను వేతనం లభించే పనిగా పరిగణించకుండానే యాజమాన్యాల కోసం తమ శ్రమను వెచ్చిస్తున్నది. అయితే ప్రపంచ వ్యాప్తంగా పరిస్థితి అంత తీవ్రంగా లేదు. 62 శాతం మంది కార్మికులు వారానికి ఐదు వేతనం లేని పనిగంటలు, 26 శాతం మంది ఆరు నుంచి 15 గంటలు, 12 శాతం 16, అంతకు మించి పనిగంటలతో విధులు నిర్వహిస్తున్నారు. అత్యధిక సమయం కార్మికులతో పనిచేయించినంత మాత్రాన ఉత్పత్తి పరిమాణం పెరుగుతుందని భావించడం సరికాదని ఆ నివేదిక తెలిపింది. వేతనం లేని పనిభారం అధికంగా ఉన్న కార్మికులు తాము తమ సామర్థ్యానికి తగిన స్థాయిలో పనిచేయడం లేదని చెప్పే అవకాశం ఉందని, అంతేకాక పనిలో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, ఉద్యోగాన్ని వదిలేయాలనే ఆలోచన ఎక్కువగా ఉండవచ్చునని ఆ సర్వే తెలిపింది.

# పేకాట స్థావరంపై ఒంగోలు టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి..

**-ఆరుగురుని అదుపులోకి తీసుకున్న పోలీసులకు**

**-రూ.1,01,070 నగదు, 6 సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం**

**టంగుటూరు,ప్రకాశం నవసంఘర్షణ**



ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఒంగోలు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.ప్రకాశం జిల్లా టంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నాయుడుపాలెం గ్రామ రైల్వే ట్రాక్ పక్కన శివారులో గురువారం మధ్యాహ్నం సమయంలో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సీఐ కమలాకర్ ఆధ్వర్యంలో SI బి. వినోద్ బాబు, ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా మరియు వారి సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు.ఈ దాడిలో 6 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.1,01,070/- నగదు, 6 మొబైల్ ఫోన్లు, 1 మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు నిమిత్తం టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో టాస్క్ ఫోర్స్ పోలీసులు అప్పగించడం జరిగింది.ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, జూద క్రీడలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే, జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ 9121102113, పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

# బీరు సీసాతో యువకుడిపై హత్యాయత్నం

**-ముద్దాయి అరెస్ట్..చేసిన పొదిలి పోలీసులు**

**పొదిలి,మార్కాపురం, జిల్లా నవసంఘర్షణ**




పొదిలి మండలంలోని కాటూరివారిపాలెం గ్రామానికి చెందిన సోము ప్రసాద్ పై హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడిని పొదిలి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. పొదిలి పట్టణంలోని నవాబ్‌మిట్టకు చెందిన షేక్ మీరవాలి (45) కాటూరి శ్రీను లారీకి క్లీనర్‌గా వెళ్లిన సోము ప్రసాద్‌ను హత్య చేయాలనే ఉద్దేశంతో పథకం ప్రకారం దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో 01.09.2026 సాయంత్రం 5.30 గంటల సమయంలో బీరు సీసాను పగులకొట్టి, పదునైన సీసా ముక్కతో సోము ప్రసాద్ పొట్టపై పొడిచి హత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై సోము ప్రసాద్ తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొదిలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడు షేక్ మీరవాలిని 03.09.2026 మధ్యాహ్నం 2 గంటల సమయంలో పొదిలి పట్టణంలోని మర్రిపూడి క్రాస్ రోడ్డు వద్ద అరెస్ట్ చేసినట్లు పొదిలి ఎస్ఐ రాజేష్ తెలిపారు. అనంతరం నిందితుడిపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

# మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు, రిటైర్డ్ పోలీసు సిబ్బంది, హోంగార్డుల సంక్షేమానికి పోలీస్ శాఖ అండగా ఉంటుంది.

**ఒంగోలు,మార్కాపురం నవసంఘర్షణ**





ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో విధులు నిర్వహిస్తూ వివిధ కారణాలతో మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలు, రిటైర్డ్ పోలీసు సిబ్బంది, హోంగార్డుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్. యుగంధర్ బాబు తో పాటు ఎఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు గురువారం పోలీస్ కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందాల్సిన సంక్షేమ, రిటైర్మెంట్ ప్రయోజనాలు, ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై వివరాలు సేకరించారు. పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత డీపీఓ అధికారులకు అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు ఆదేశించారు. కారుణ్య నియామకాలు పొందని కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి, వారికి త్వరితగతిన కారుణ్య నియామకాలు పొందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**అడిషనల్ ఎస్పీ ఎన్. యుగంధర్ బాబు మాట్లాడుతూ...**

పోలీసు శాఖలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సర్వీసులో లేకపోయినా ప్రతి ఒక్కరూ పోలీసు కుటుంబంలో భాగమేనని, వారి సంక్షేమానికి జిల్లా పోలీసులు ఎల్లవేళలా వారికి బాసటగా ఉంటారని భరోసా ఇచ్చారు. సుదీర్ఘకాలం ప్రజాసేవకు అంకితమై విధులు నిర్వర్తించి రిటైర్మెంట్ పొందిన పోలీసు సిబ్బందిని, వారి కుటుంబ సభ్యులను కలుసుకోవడం ఆనందంగా ఉందని, వారు అందించిన సేవలను పోలీసు శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం తరుపున రావలసిన ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని, పోలీస్ కుటుంబ సభ్యులకు ఏ సమస్య వచ్చిన తనను నేరుగా కలవచ్చునని తెలియచేసినారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీతారామిరెడ్డి,ఏఏఓ పిఈ విజయ కుమార్, డీపీఓ సూపరింటెండెంట్ లు యాస్మిన్ భాను,వినుత మరియు డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకులాల్లో ఆ విద్యార్థులవి ప్రభుత్వ హత్యలే..

**-ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్ సంచలన వ్యాఖ్యలు**

**-కమ్మదనం గురుకుల పాఠశాలను ముట్టడించిన ఏబీవీపీ, ఎస్‌ఎఫ్ఐ, బిఆర్ఎస్ జనసేన సంఘాలు..**

**-గురుకులం ఎదుట గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులతో ధర్నా**

**-పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ సీతారాం తదితర పోలీసు సిబ్బంది**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవసంఘర్షణ**

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలం కమ్మదనం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన గిరిజన విద్యార్థిని ముడావత్ అశ్విని మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) ఇచ్చిన పిలుపు మేరకు గురువారం కమ్మదనం గురుకుల పాఠశాలను గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులు ముట్టడించారు. గురుకుల పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు. ఈ ఆందోళనలో ఎస్‌ఎఫ్ఐ, ఏబీవీపీ, జనసేన, యువసేత తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు. అశ్విని మృతి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని, ఘటనకు సంబంధించి తమకు అనేక అనుమానాలు ఉన్నాయని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రాంబాల్ నాయక్ ఆరోపించారు. అశ్విని మృతికి సంబంధించిన ప్రతి అంశాన్ని అన్ని కోణాల్లో పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకులాల్లో వివిధ పరిస్థితుల్లో సుమారు 150 మంది విద్యార్థులు మృత్యువాత పడ్డారని రాంబాబు నాయక్ ఆరోపించారు. విద్యార్థులు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందుతుంటే ఇవి ప్రభుత్వ హత్యలేనని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల భద్రతపై ప్రభుత్వం ఎందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కమ్మదనం గురుకుల పాఠశాలలో అశ్విని మృతిపై తమకు పలు అనుమానాలు ఉన్నాయని, బోధన సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపల్ పాత్రపై కూడా అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని రాంబాబు నాయక్ అన్నారు. అశ్వినిని ప్రిన్సిపల్ తీవ్రంగా తిట్టి, మందలించడం వల్లే ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ఆయన ఆరోపించారు. ఈ కోణంలో కూడా పోలీసులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా కమ్మదనం గురుకుల పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నాయని రాంబాబు నాయక్ తెలిపారు. గతంలో వెన్నెలతో పాటు మరో విద్యార్థిని మృతి చెందారని, ఇప్పుడు అశ్విని కూడా అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని పేర్కొన్నారు. గత ఘటనలను కూడా దృష్టిలో పెట్టుకుని కమ్మదనం గురుకుల పాఠశాలలో నిజనిర్ధారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని రాంబాబు నాయక్ ప్రశ్నించారు. అశ్విని ఆత్మహత్యకు పాల్పడుతున్న సమయంలో హాస్టల్ వార్డెన్, ఇతర సిబ్బంది ఏం చేస్తున్నారని, ఆ సమయంలో ప్రిన్సిపల్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. తరగతి గదిలో ఉండాల్సిన విద్యార్థిని డార్మెటరీకి ఎందుకు వెళ్లిందనే విషయాన్ని కూడా పోలీసులు విచారించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులు వరుసగా మృత్యువాత పడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రాంబాబు నాయక్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్ద ఉంచుకోవడం ద్వారా విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు గురుకులాల్లో చదువుకుంటున్నారని, వారిని విద్యకు దూరం చేయడానికి కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. అశ్విని మృతిపై నిష్పక్షపాతంగా, సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గిరిజన నాయకులు, అశ్విని బంధువులు డిమాండ్ చేశారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని, అశ్విని కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని కోరారు. ఆందోళన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీపీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ఆందోళనకారులు విద్యార్థులతో మాట్లాడేందుకు, ఘటనకు సంబంధించిన విషయాలను తెలుసుకునేందుకు పోలీసులు అవకాశం కల్పించారు. ఈ ధర్నాలో భారత రాష్ట్ర సమితి గిరిజన విభాగం నాయకులు మాజీ చైర్మన్ వాలియా నాయక్, ఏబీవీపీ నేత పుట్నాల సాయికుమార్, ఎస్‌ఎఫ్ఐ నేత వడ్ల శ్రీకాంత్, యువసేత కన్వీనర్ లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అశ్విని మృతికి కారణాలను పూర్తిస్థాయిలో వెలికితీసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రజల అవసరమే ప్రాధాన్యత

**-బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్**

**-సొంత నిధులతో చౌలపల్లిలో మట్టి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిన రవీందర్ యాదవ్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 03 నవసంఘర్షణ**

కేశంపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందించడంలో ముందుండే బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ మరోసారి సేవాభావాన్ని చాటుకున్నారు. కేశంపేట మండలం చౌలపల్లి గ్రామంలోని కోట మైసమ్మ దేవాలయం నుంచి హనుమాన్ దేవాలయం వరకు మట్టి రోడ్డు నిర్మాణ పనులను తన సొంత నిధులతో చేపట్టారు. ఈ మేరకు రోడ్డు పనులను గురువారం గ్రామస్థుల సమక్షంలో ప్రారంభించారు. దేవాలయాలకు వెళ్లే భక్తులతో పాటు గ్రామస్థులు రాకపోకల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు రవీందర్ యాదవ్ తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో తన వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింగరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురలీధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పర్వత్ రెడ్డి, ఎన్ఆర్ఐ నాయకులు గోగు వెంకట నారాయణరెడ్డి, సర్పంచులు హరి శేఖర్, వేణుగోపాల్ చారి, భాస్కర్ నాయక్, రమేష్ యాదవ్, ధనలక్ష్మి రామకృష్ణ, మాజీ సర్పంచులు శ్రీశైలం, వెంకట్ రెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకటేష్ యాదవ్, నవీన్ కుమార్, తిర్మల్రెడ్డి శ్రీనివాస్, బీరప్ప, జగన్, నాయకులు జగన్మోహన్ రెడ్డి, ప్రేమ్ కుమార్ గౌడ్, జమాల్ ఖాన్, సాటు రామకృష్ణ, నాగేష్, రాజశేఖర్, శ్రీను, దర్శన్, జె.శ్రీను, అంజయ్య, చెన్నయ్య, నరసింహా, మహేష్, చంటి, బాబు యాదవ్, యాదగిరి యాదవ్, నరేష్ యాదవ్, కుమ్మరి వెంకటేష్, బి. కృష్ణయ్య, రవి నాయక్, సాజిద్, గోపాల్, బైకని శేఖర్, ప్రవీణ్ రెడ్డి, వెంకటేష్, కార్తీక్, గోపి రాము, షకీల్, సలీం, కృష్ణ యాదవ్, యాదగిరి, మంగలి మహేష్, రాజు, యాదగిరి, శివ, అసిఫ్, గణేష్ గౌడ్, చుక్క శ్రీను, హరీష్, అనిల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోటో ఫోజులు మీవి.. రేషన్ బియ్యం కేంద్రానిది!

**-సొమ్ము మోదీ ప్రభుత్వానిది.. సోకు రేవంత్ రెడ్డిదా?**

**-సిగ్గుండాలే.. రేషన్ పంపిణీలో మీ వాటా ఎంత?**

**-స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి తీవ్ర ఆగ్రహం**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 03 నవసంఘర్షణ**

కేంద్ర ప్రభుత్వం దేశంలోని పేదల కోసం అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని కూడా తమ ఘనతగా ప్రచారం చేసుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో ఫోజులకు దిగడం సిగ్గుచేటని బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈరోజు కొందుర్గు మండల కేంద్రంలో ఎమ్మెల్యే పంపిణీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను వ్యతిరేకిస్తూ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రం అందిస్తున్న సంక్షేమాన్ని తమ ఖాతాలో వేసుకుని రాజకీయ ప్రచారం చేసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. "సొమ్ము కేంద్రానిది.. పథకం కేంద్రానిది.. రేషన్ బియ్యం కేంద్రానిది.. మరి ఫోటో మాత్రం ముఖ్యమంత్రిదా?" అని ప్రశ్నించారు. ప్రజలకు వాస్తవాలు తెలియకుండా కేంద్ర ప్రభుత్వ పాత్రను మరుగునపెట్టి, రాష్ట్ర ప్రభుత్వం చేసినట్లుగా ప్రచారం చేసుకోవడం మానుకోవాలని హెచ్చరించారు.

**స్మార్ట్ రేషన్ కార్డుపై మోదీ ఫోటో లేకపోవడం దురదృష్టకరం**

దేశంలోని పేదలకు ఉచిత రేషన్ అందించడంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. అలాంటి పథకానికి సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫోటో లేకపోవడం రాష్ట్ర ప్రభుత్వ సంకుచిత రాజకీయాలకు నిదర్శనమన్నారు. "కేంద్రం చేస్తే రాష్ట్రం చేసినట్టు.. మోదీ చేస్తే రేవంత్ ఫోజులు!" అంటూ ఘాటుగా విమర్శించారు. కేంద్ర పథకాలకు కాంగ్రెస్ పార్టీ స్టిక్కర్లు అతికించుకుని రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కేంద్రం చేస్తున్న సేవలను తమ ఖాతాలో వేసుకోవడం కాదు.. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ప్రజలకు నిజాయితీగా చెప్పాలి. పేదల సంక్షేమ పథకాలను రాజకీయ ప్రచార వేదికలుగా మార్చుకోవడం వెంటనే ఆపాలి! అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షులు లక్ష్మీ గౌడ్, కొమరబండ శ్రీశైలం, పర్వతాపూర్ సర్పంచ్ బోయ అశోక్, నాయకులు గుండేటి శివారెడ్డి, సున్నాల అంజయ్య, ప్రధాన కార్యదర్శి చంద్ర ముదిరాజ్, కార్తీక్ యాదవ్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ చారి, రఘునాథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బూత్ అధ్యక్షులు గోపి నర్సింలు, శివకుమార్, గడ్డమీది రవి, చిన్నమయ్య, వెంకటేష్, సుభాన్ రెడ్డి, సురేష్, పవన్ కుమార్ గౌడ్, రవి, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్, శివకుమార్, రమేష్, నరేష్ గౌడ్, కృష్ణమాచారి, మల్లేష్, ఎర్ర రవి, మల్లారెడ్డి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజినెస్

## భారీ నష్టాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

**-ఆరంభ లాభాలు ఆవిరి.. చివరికి నష్టాల్లోకి సూచీలు**

**-417 పాయింట్లు పతనమైన సెన్సెక్స్.. 23,900 దిగువకు నిఫ్టీ**

**-చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలతో పెరిగిన ఆందోళనలు**




**ముంబై, సెప్టెంబర్ 3**
దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఉదయం భారీ లాభాలతో ప్రారంభమైన సూచీలు.. క్రమంగా అమ్మకాల ఒత్తిడి పెరగడంతో నష్టాల్లోకి జారుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల సంకేతాలు, పెరుగుతున్న ముడిచమురు ధరలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. దీంతో ట్రేడింగ్ ముగిసే సమయానికి ప్రధాన సూచీలు నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 417.49 పాయింట్లు లేదా 0.55 శాతం నష్టపోయి 76,152.86 వద్ద స్థిరపడింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 41 పాయింట్లు లేదా 0.17 శాతం క్షీణించి 23,873.45 వద్ద ముగిసింది. దీంతో నిఫ్టీ కీలకమైన 23,900 స్థాయి దిగువకు చేరింది. ఉదయం ట్రేడింగ్‌లో కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్లు కొంతకాలం లాభాల్లో కొనసాగాయి. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలోని కొన్ని షేర్లలో కొనుగోళ్లు కనిపించాయి. అయితే అంతర్జాతీయ పరిణామాలు, ముడిచమురు ధరలపై నెలకొన్న ఆందోళనలు మార్కెట్‌పై ఒత్తిడిని పెంచాయి. దీంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు గరిష్ఠ స్థాయిల నుంచి గణనీయంగా వెనక్కి వచ్చాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల మార్కెట్ వర్గాలను ఆందోళనకు గురిచేశాయి. ముడిచమురు ధరలు పెరగడం వల్ల దిగుమతుల వ్యయం, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్న భయాలు ఇన్వెస్టర్లలో కనిపించాయి. దీంతో ఐటీ, ఆటో, వినియోగ రంగాలకు చెందిన పలు షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. అయితే బ్యాంకింగ్ రంగంలోని కొన్ని షేర్లు మార్కెట్‌కు కొంత మద్దతు అందించాయి. నిఫ్టీ బ్యాంక్ సూచీ 0.36 శాతం లాభపడటం గమనార్హం. మరోవైపు నిఫ్టీ ఐటీ సూచీ 0.85 శాతం పడిపోయింది. టెక్ మహీంద్రా, బజాజ్ ఆటో, ట్రెంట్, సిప్లా, మహీంద్రా అండ్ మహీంద్రా వంటి షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో మాత్రం కొంత కొనుగోలు ఆసక్తి కొనసాగింది. మార్కెట్‌లో మొత్తం సెంటిమెంట్ ప్రతికూలంగా ఉన్నప్పటికీ ఎంపిక చేసిన షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. దీంతో విస్తృత మార్కెట్ సూచీలు బెంచ్‌మార్క్ సూచీలతో పోలిస్తే మెరుగ్గా రాణించాయి. మార్కెట్‌లో ఒడిదుడుకులు కొనసాగుతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో అంతర్జాతీయ పరిణామాలు, ముడిచమురు ధరలు, రూపాయి కదలికలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

## భారీగా పెరగనున్న సిమెంట్ ధరలు

**-బస్తాపై రూ.30 నుంచి రూ.40 వరకు పెంపు..**

**- నిర్మాణ ఖర్చులు మరింత భారం**



**హైదరాబాద్:**
కొత్త ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారికి మరో భారం పడనుంది. ఈ నెల 5వ తేదీ నుంచి సిమెంట్ ధరలను పెంచేందుకు తయారీ కంపెనీలు సిద్ధమవుతున్నట్లు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. సిమెంట్ బస్తాపై రూ.30 నుంచి రూ.40 వరకు ధర పెరిగే అవకాశం ఉంది. ఈ పెంపు అమల్లోకి వస్తే తెలుగు రాష్ట్రాల్లో సిమెంట్ ధరలు సుమారు 10 శాతం వరకు పెరగనున్నాయి. ముడిసరుకు ధరలు, ప్యాకేజింగ్, రవాణా ఖర్చులు పెరగడంతోనే ధరలను పెంచాలని కంపెనీలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇసుక, స్టీల్, ఇటుకలు తదితర నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిన నేపథ్యంలో సిమెంట్ ధరల పెంపు నిర్మాణ రంగంపై అదనపు భారాన్ని మోపనుంది. దీంతో ఇళ్లు నిర్మించుకునే వారితో పాటు నిర్మాణ సంస్థలపై కూడా వ్యయభారం పెరిగే అవకాశం ఉంది.

## బైక్ కొనేవారికి పండగే..తక్కువ ఈఎంఐ, భారీ డిస్కౌంట్లు!

**ప్రముఖ కంపెనీల నుంచి ఆకర్షణీయ ఆఫర్లు..**



న్యూఢిల్లీ
ద్విచక్ర వాహనం కొనుగోలు చేయాలనుకునే వారికి ప్రముఖ కంపెనీలు ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నాయి. హీరో, బజాజ్, టీవీఎస్, హోండా, సుజుకి సంస్థలు క్యాష్ డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, ప్రత్యేక ఈఎంఐ పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. దీంతో బైక్ లేదా స్కూటర్ కొనుగోలుదారులకు ప్రారంభ ఖర్చు కొంత తగ్గే అవకాశం ఉంది. రాయల్ ఎన్‌ఫీల్డ్ తక్కువ డౌన్ పేమెంట్ ఆప్షన్లు అందిస్తుండగా.. టీవీఎస్ ఐక్యూబ్‌పై కొన్ని బ్యాంకుల ద్వారా డిస్కౌంట్లు లభిస్తున్నాయి. మరోవైపు ఓలా ఎలక్ట్రిక్ నో-కాస్ట్ ఈఎంఐ, క్యాష్‌బ్యాక్ వంటి ప్రయోజనాలను ప్రకటించింది. మోడల్, వేరియంట్, డీలర్‌ను బట్టి ఆఫర్లలో మార్పులు ఉండవచ్చు. అయితే తక్కువ ఈఎంఐ పేరుతో ఎక్కువ వడ్డీ చెల్లించాల్సి వస్తుందా అనే విషయాన్ని ముందుగా పరిశీలించాలి. వడ్డీ రేటు, డౌన్ పేమెంట్, ప్రాసెసింగ్ ఫీజు, ఈఎంఐతో పాటు వాహనం తయారీ సంవత్సరం, VIN నంబర్ వివరాలను డీలర్ వద్ద నిర్ధారించుకున్న తర్వాతే కొనుగోలు చేయడం మంచిది.

## షమీకి మళ్లీ నిరాశే.. బుమ్రా, సిరాజ్ సహా ఐదుగురు పేసర్లతో కివీస్ పర్యటనకు భారత్!

**-న్యూజిలాండ్ పర్యటనకు భారత్ ప్రణాళికలు**

**-ఐదుగురు పేసర్లతో బరిలోకి దిగే అవకాశం**

**-మహమ్మద్ షమీకి మరోసారి నిరాశ తప్పదా!**



శ్రీలంకతో టెస్టు సిరీస్‌ను 1-0తో కైవసం చేసిన టీమిండియా.. రాబోయే న్యూజిలాండ్ టెస్టు సిరీస్ కోసం ప్రణాళికలను వేగవంతం చేసింది. న్యూజిలాండ్ పర్యటనలో రెండు టెస్టు మ్యాచ్‌ల కోసం సెలెక్టర్లు ఐదుగురు పేసర్లను షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. కివీస్ పిచ్‌లు పేస్‌కు అనుకూలంగా ఉంటాయి. అందుకే బలమైన పేస్ దళంతో బరిలోకి దిగాలని భారత్ భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రధాన ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్‌లతో పాటు ప్రసిద్ధ్ కృష్ణ, యువ పేసర్లు గుర్నూర్ బ్రార్, ఆకాశ్ దీప్ షార్ట్ లిస్ట్‌లో ఉన్నట్లు సమాచారం. న్యూజిలాండ్ పిచ్‌లపై ఉండే సీమ్, బౌన్స్‌లను అనుకూలంగా మలచుకునే సత్తా ఉన్న బౌలర్లకే ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది.సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీని టెస్టుల్లోకి తీసుకోవాలని సెలక్టర్లు భావించడం లేదని తెలుస్తోంది. సుదీర్ఘ అనుభవం ఉన్న షమీని కాదని యువ బౌలర్లవైపు సెలక్టర్లు మొగ్గుచూపుతున్నారు. షమీతో పాటు దేశవాళీలో మెరుగ్గా రాణిస్తున్న ఆకిబ్ నబీకి కూడా ఈ జాబితాలో స్థానం లభించలేదు. వచ్చే ఏడాది జరగబోయే కీలకమైన టోర్నీలను దృష్టిలో ఉంచుకుని యంగ్ పేసర్లకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని క్రికెట్ బోర్డు భావిస్తున్నట్లు సమాచారం. జట్టులో సీనియర్లుగా ఉన్న బుమ్రా, సిరాజ్‌లు పేస్ విభాగానికి సారథ్యం వహించనుండగా, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, గుర్నూర్ బ్రార్‌లు వారికి సపోర్ట్‌గా నిలవనున్నారు. ముఖ్యంగా గుర్నూర్ బ్రార్ వంటి యువ వేగవంతమైన బౌలర్‌కు ఇది మంచి అవకాశంగా మారనుంది. టెస్టుల్లో లాంగ్ స్పెల్స్ వేసే బౌలర్లకు కొరత లేకుండా పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో ఉన్న ఐదుగురు బౌలర్లను ముందస్తుగా సిద్ధం చేయడంపై బీసీసీఐ దృష్టి సారించింది! ఈ పర్యటనలో భారత్, న్యూజిలాండ్ జట్లు రెండు టెస్టుల్లో తలపడనున్నాయి. మొదటి టెస్టు నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ వేదికగా జరగనుంది. ఆ తర్వాత రెండో టెస్టు నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్ వేదికగా నిర్వహించనున్నారు. ఈ సిరీస్‌లో సత్తాచాటి డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు మెరుగుపర్చుకోవాలని భారత్ భావిస్తోంది.

## వింత నిర్ణయాలతో నవ్వులపాలవుతున్న పాక్ క్రికెట్ బోర్డు..!

**-వింత నిర్ణయాలతో వార్తల్లో నిలుస్తున్న పీసీబీ**

**-ఫీల్డింగ్ కోచ్ నియామకం కోసం లింక్డిన్‌లో ప్రకటన**

**-లింక్డిన్ ప్రకటనపై సెటైర్లు వేసిన జోస్ బట్లర్**



ఇంగ్లాంట్ టూర్ ఏమోగానీ.. పాకిస్థాన్ క్రికెట్ జట్టు ఇటీవల పదే పదే వార్తల్లో నిలుస్తోంది. ఆటలో పేలవ ప్రదర్శన చేస్తూ విమర్శలపాలవుతున్న ఆ జట్టు.. తన చేష్టలతోనూ అంతకంటే ఎక్కువ ఫేమస్ అవుతోంది. ఇంగ్లాండ్ గడ్డపై వరుసగా రెండు టెస్టుల్లో చిత్తుగా ఓడటం, ఆ తర్వాత ఏడుగురు ఆటగాళ్లు సహా.. కోచింగ్ స్టాఫ్‌పై వేటు వేయడం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయంపై ఆ జట్టును ఉద్దేశించి పలువురు మాజీలు నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇంగ్లాండ్ మాజీ ఆటగాడు కెవిన్ పీటర్సన్ ఇటీవల పాకిస్థాన్ ఏడుగురు ఆటగాళ్లను ఇంటికి పంపడంపై విమర్శనాస్త్రాలు సంధించాడు. జట్టులో మార్పుల గురించి టాస్ సందర్భంగా కెప్టెన్ బాబర్ ఆజమ్.. సుదీర్ఘ వివరణ ఇవ్వాల్సి ఉంటుందని ఎద్దేవా చేశాడు. అందుకోసం ఒకరోజు ముందే టాస్ ప్రక్రియ ప్రారంభించాలని ట్రోల్ చేశాడు. తాజాగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డుపై ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ సైతం సెటైర్లు వేశాడు. కాగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఇటీవల లింక్డిన్‌లో ఓ యాడ్ ఇచ్చింది. అందులో ఫీల్డింగ్ కోచ్ ఖాళీ ఉందని పేర్కొంది. దీంతో సోషల్ మీడియాలో మరోసారి ట్రోల్ అయింది. తాజాగా ఇదే విషయంపై జోస్ బట్లర్ స్పందించాడు. అన్ని జట్లూ ఇలానే చేస్తే బాగుంటుందని పాకిస్థాన్‌పై వ్యంగ్యాస్త్రాలు గుప్పించాడు. 'పాకిస్థాన్ ప్రకటనను సమర్థించడానికి ప్రయత్నిస్తున్నాను. తమ కొత్త ఫీల్డింగ్ కోచ్ నియామకం కోసం పాకిస్థాన్ క్రికెట్ బ్రోడు.. సంప్రదాయ, ఆధునిక వ్యూహాన్ని అనుసరించిందని అనుకుంటున్నా. అందుకోసమే లింక్డిన్‌లో పోస్టు చేసింది. ప్రస్తుత రోజుల్లో అన్ని జట్లూ ఇలాంటి జాబ్ ప్రకటనలు ఇవ్వాలి. ఇంగ్లాండ్ కూడా అదే చేస్తుందేమో నాకైతే తెలియదు" అని ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ వ్యాఖ్యానించాడు.కాగా పాకిస్థాన్ ఫీల్డింగ్ కోచ్‌గా షేన్ మెక్‌డార్మెట్ పదవీకాలం గత వారమే ముగిసింది. సాధారణంగా అధికారికంగా నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తారు. కానీ, లింక్డిన్‌లో పోస్టు చేయడం మాత్రం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవాలని పాక్ బోర్డు ఆ పోస్ట్‌లో పేర్కొనడం గమనార్హం

# స్పోర్ట్స్

## భారత్ కూడా ఓడిందిగా.. ఒక్కరాత్రిలో ఎవరూ ఛాంపియన్ కాలేరు..!



ఇంగ్లండ్ గడ్డపై చతికిలపడుతున్న పాకిస్థాన్ జట్టుకు మద్దతు లభించింది. వరసగా రెండు టెస్టులో ఘోర ఓటమిపై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ పాక్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ తమ టీమ్‌కు బాసటగా నిలాచాడు. సిరీస్ పరాజయంతో పాక్ పని అయిపోలేదని పేర్కొన్న నఖ్వీ ఈ సందర్భంగా భారత జట్టు పేరును ప్రస్తావించాడు. మేటి జట్టైన టీమిండియా ఇటీవల చిన్న జట్టు చేతిలో ఓడింది. అలాగనీ వాళ్ల క్రికెట్ ఆగిపోలేదుగా అని విమర్శకులకు కౌంటర్ ఇచ్చాడు పీసీబీ చీఫ్.లార్డ్స్ టెస్టులో ఓటమి.. స్క్వాడ్ నుంచి ఏడుగురిని తప్పించడం వంటి పరిణామాలు పాకిస్థాన్ క్రికెట్‌లో దుమారం రేపాయి. సెలెక్టర్ కమిటలోని మాజీ ఆటగాడు మిస్బాహుల్ హక్ రాజీనామా చేశాడు. మొహ్సిన్ నఖ్వీ నేతృత్వంలోని బోర్డు చెత్త నిర్ణయాలతోనే పాక్ జట్టు ఆట అధ్వాన్నంగా మారిందనే విమర్శలు జోరందుకున్నాయి. దాంతో.. తనను, పాక్ టీమ్‌ను లక్ష్యంగా చేసుకున్నవాళ్లకు నఖ్వీ కౌంటర్ ఇచ్చాడు.'ఇటీవల పెద్ద జట్లు కూడా ఓడిపోయాయి. ఐర్లాండ్ చేతిలో టీమిండియా, నమీబియా చేతిలో దక్షిణాఫ్రికా జట్లు పరాజయం చవిచూశాయి. అంతమాత్రాన వాళ్ల క్రికెట్ ముగియలేదు కదా. ఒక్కరాత్రిలోనే ఏ జట్టు కూడా ఛాంపియన్ కాలేదు. ఈమధ్య కాలంలో పాకిస్థాన్ జట్టు చాలా మెరుగైంది. టీ20 ర్యాంకింగ్స్‌లో 9వ స్థానంలో ఉండే పాక్ ఇప్పుడు ఆరో ర్యాంక్‌లో కొనసాగుతోంది. వన్డేల్లో ఎనిమిదో స్థానం నుంచి ఐదో ర్యాంక్‌కు ఎగబాకింది. కాబట్టి నేను విమర్శలకు భయపడను. ముఖ్యంగా జీవితంలో ఏమీ సాధించనివారి మాటల్ని నేను అస్సలు పట్టించుకోను. అయితే.. ఇంగ్లండ్‌పై పాక్ జట్టు ప్రదర్శన పట్ల నేనూ నిరాశచెందాను. కానీ, నేను పీసీబీ అధ్యక్షుడిగా సరిగ్గా పనిచేయడం లేదని అంటున్నవాళ్లకు ఏమీ తెలియదు' అని నఖ్వీ పేర్కొన్నాడు.తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు, ప్రవర్తనతో వార్తల్లో నిలిచే మొహ్సిన్ నఖ్వీ 2024 ఫిబ్రవరి 6వ తేదీన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడయ్యాడు. అతడు ఏమంట ఈ పదవి చేపట్టాడో.. దాయాది జట్టు ఆటలో దూకుడు, విజయకాంక్ష తగ్గింది. గత రెండేళ్ల కాలంలో పాకిస్థాన్ ఆట గాడి తప్పింది. భారత్, శ్రీలంక ఆతిథ్యమిచ్చిన టీ20 వరల్డ్‌కప్‌లో పాక్ గ్రూప్ దశలోనూ నిష్క్రమించింది. ఆపై.. బంగ్లాదేశ్ చేతిలో 10 వికెట్ల తేడాతో ఓడి.. టెస్టు సిరీస్ కోల్పోయింది. ఇది చాలదన్నట్టు.. ర్యాంకింగ్స్‌లోనూ పాక్ దిగజారింది. అసలే పతనం అంచున ఉన్న పాక్ క్రికెట్‌కు.. ఇంగ్లండ్ పర్యటనలో సిరీస్ ఓటమి పుండు మీద కారం చల్లినట్టైంది. బ్యాటర్ల వైఫల్యంతో వరసగా రెండు టెస్టుల్లో ఓడిన పాక్ సిరీస్ కోల్పోయింది. నామమాత్రమైన మూడో మ్యాచ్ సెప్టెంబర్ 9 నుంచి ఎడ్జ్‌బాస్టన్‌లో జరుగనుంది. ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి వైట్‌వాష్ తప్పించుకోవాలని పాక్ భావిస్తోంది.

# ఎన్టీఆర్ 'డ్రాగన్' లో షాహిద్ కపూర్, ఆలియా భట్.?

ఎన్టీఆర్ -- ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ ప్రాజెక్ట్ 'డ్రాగన్' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్, ప్రముఖ నటి ఆలియా భట్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలుస్తుంది. దీనికి సంబంధించిన వార్తలు అటు బీ టౌన్‌తో పాటు ఇటు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.ఇందులో షాహిద్ కపూర్ పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించనుండగా, ఆలియా భట్ కీలకమైన పాత్రలో ఎన్టీఆర్ సరసన నటించనున్నట్లు ఫిల్మ్ నగర్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధమవుతున్న ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో మరియు టాలీవుడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ ప్రాజెక్ట్‌ను ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్, యువ సుధా ఆర్ట్స్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.





## అందంతో చంపేస్తున్న ఆషికా..

# ప్రశాంత్ నీల్ మూవీకి సెన్సార్ కష్టాలు..

**-రివైజింగ్ కమిటీని ఆశ్రయించిన '418' టీమ్!**




అగ్ర దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో తెరకెక్కిన హారర్ సినిమా '418' సెన్సార్ బోర్డు అడ్డంకులను ఎదుర్కొంటోంది. ఈ సినిమాలో హారర్ సీన్లు ఎక్కువగా ఉన్నాయంటూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అభ్యంతరం తెలపడంతో, మేకర్స్ రివైజింగ్ కమిటీని ఆశ్రయించారు. కిర్తన్ నాడగౌడ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూలై 31నే విడుదల కావాల్సి ఉండగా, సెన్సార్ సమస్యల కారణంగా వాయిదా పడింది. అయితే సర్టిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నారు.ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రశాంత్ నీల్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన కిర్తన్ నాడగౌడ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్నాడు. అయితే ఒక హారర్ చిత్రంలో హారర్ ఎలిమెంట్స్ ఎక్కువగా ఉన్నాయని సెన్సార్ బోర్డు అభ్యంతరం తెలపడం పట్ల నెటిజన్లు సోషల్ మీడియాలో సంధిస్తున్నారు. 'హారర్ సినిమాలో హారర్ సీన్లు కాక ఇంకేముంటాయి?' అంటూ సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తున్నారు.

# మాస్ స్టెప్పులతో అదరగొట్టిన శ్రీముఖి




సోషల్ మీడియాను ప్రస్తుతం ఓ ఊపు ఊపేస్తున్న తెలంగాణ జానపదం 'యేషనాగుల కట్టమీద'. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాలో ఈ పాటను కొత్తగా రీమిక్స్ చేయడంతో దీనికి విపరీతమైన క్రేజ్ వచ్చింది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ప్రతీ ఒక్కరూ ఈ పాట బీట్‌కు స్టెప్పులేస్తూ రీల్స్ చేస్తున్నారు. తాజాగా ఈ ట్రెండింగ్‌లో స్టార్ యాంకర్ శ్రీముఖి కూడా చేరిపోయారు. తనదైన స్టైల్లో మాస్ స్టెప్పులేసి సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. జిమ్‌లో వర్కవుట్ల మధ్య 'యేషనాగుల కట్టమీద' పాటకు శ్రీముఖి ఎంతో ఎనర్జీతో డ్యాన్స్ చేశారు. వైట్ టీషర్ట్, బ్లూ మినీ షార్ట్స్‌లో కనిపించిన ఆమె, పాటలోని మాస్ బీట్‌కు తగ్గట్టుగా అదిరిపోయే స్టెప్పులతో ఆకట్టుకున్నారు. 'సెప్టెంబర్ ఎనర్జీ' అనే క్యాప్షన్‌తో ఈ డ్యాన్స్ వీడియోను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియో వైరల్‌గా మారింది. శ్రీముఖి డ్యాన్స్ చూసిన నెటిజన్లు ఆమె ఎనర్జీకి ఫిదా అవుతున్నారు. 'బుల్లితెర రాములమ్మ అదరగొట్టేసింది', 'మాస్ స్టెప్పులతో ఇరగదీశారు', 'మీ ఎనర్జీ లెవల్స్ వేరే లెవల్' అంటూ కామెంట్ల రూపంలో ప్రశంసలు కురిపిస్తున్నారు. పాటలోని ఊపుకు శ్రీముఖి పెర్ఫార్మెన్స్ సరిగ్గా సరిపోయిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. కొన్నేళ్ల నాటి ఈ జానపద గీతాన్ని 'ది ప్యారడైజ్' చిత్ర బృందం అద్భుతంగా తెరకెక్కించింది. తెలంగాణ జానపద సాహిత్యంలోని కమ్మదనం, దుమ్మురేపే మాస్ బీట్‌కు నాని, కీర్తి సురేశ్ ఎనర్జిటిక్ స్టెప్పులు తోడవడంతో యూట్యూబ్‌లో, ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ పాట ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. ప్రస్తుతం శ్రీముఖి బుల్లితెరపై టాప్ యాంకర్‌గా బిజీగా ఉన్నారు. 'ఆదివారం విత్ స్టార్ మా పరివారం', 'బిగ్ బాస్ అగ్ని పరీక్ష' వంటి విజయవంతమైన షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు. టీవీ కార్యక్రమాలతో పాటు సినిమా ఈవెంట్లు, అప్పుడప్పుడు సినిమాల్లో నటిస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్నారు.



# త్రిష కొత్త చిత్రం

రాజకీయపరమైన అంశాలకు దూరంగా అగ్ర కథానాయిక త్రిష ప్రస్తుతం సినిమాలపై దృష్టిపెడుతున్నది. తమిళనాడు సీఎం విజయ్‌తో ఉన్న సాన్నిహిత్యం కారణంగా ఈ భామ పేరు తరచూ పొలిటికల్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఈ నేపథ్యంలో త్రిష కొత్త చిత్రం బుధవారం ప్రారంభమైంది. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నిర్మాణ సంస్థ పనోరమా స్టూడియో తమిళ ఫిల్మ్‌ప్రొడక్షన్‌లోకి అడుగుపెడుతున్నది.'ఎయిర్‌లిఫ్ట్' చిత్రంతో గుర్తింపు పొందిన రాజాకృష్ణ మీనన్ ఈ చిత్రానికి దర్శకుడు. సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కబోతున్న ఈ సినిమాలో త్రిష పాత్ర గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుందని చెబుతున్నారు. ఇందులో రాధికా శరత్‌కుమార్, అపర్ణ బాలమురళి కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# 200 కోట్ల మార్క్ దాటిన ఆవారాపన్-2'




ఇమ్రాన్ హష్మి, దిశా పటానీ జంటగా దర్శకుడు నితిన్ కక్కర్ తెరకెక్కించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం 'ఆవారాపన్ -2' బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణతో ఏకంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న దిశా పటానీ తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రేక్షకులందరూ ఎప్పటికీ గుర్తుంచుకునే ఒక అద్భుతమైన కథను చెప్పే ఈ ప్రయాణంలో, ఇంత మంచి మనసున్న వ్యక్తులతో కలిసి పనిచేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక బృందంలో భాగం కావడం ఒక గౌరవంగా భావిస్తున్నానని, 'ఆవారాపన్-2' చిత్రంపై ప్రేక్షకులు కురిపిస్తున్న అపారమైన ప్రేమకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినై ఉంటానని తెలిపారు. ఈ స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ లభించడం తన అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. 2007లో మోహిత్ సూరి దర్శకత్వంలో ఇమ్రాన్ హష్మి, శ్రియా శరణ్ జంటగా వచ్చిన 'ఆవారాపన్' చిత్రం రూ. 18 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి కేవలం రూ. 12 కోట్లు మాత్రమే రాబట్టి ఆ సమయంలో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. అయితే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వచ్చిన దీని సీక్వెల్ 'ఆవారాపన్-2' మాత్రం రూ. 200 కోట్ల మార్కును దాటి ఘన విజయం సాధించింది.